ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








శుక్రవారం 07 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 121

Friday 07 August 2026 | Vol.No 28 Issue No .121

హైదరాబాద్ | Hyderabad

పేజీలు: 12+12

వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


## సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం సమరసతకు చిరునామా

### - శ్రీ రామానుజుల సమానత్వ సందేశం నేటికీ సజీవం

### - గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



రంగారెడ్డి జిల్లా బ్యూరో ఆగస్టు 6, ( విజన్ ఆంధ్ర ):సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం సమరసతకు చిరునామా అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ముచ్చింతల్‌లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని





గురువారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ కు శ్రీ రామానుజాచార్యుల వారి జీవిత చరిత్ర పుస్తకాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి బహుకరించారు. ఇది గొప్ప ఆధ్యాత్మిక మిగతా 2లో..

## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై పార్టీల కసరత్తు




### - 2 స్థానాల కోసం 3 పార్టీల మధ్య పోటీ"

### ఖమ్మం-నల్గొండ-వరంగల్, హైదరాబాద్-రంగారెడ్డి-పాలమూరు స్థానాలకు ఎన్నికలకు ముందే లాబీయింగ్ జోరు...

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, ఆగస్ట్ 06,విజన్ ఆంధ్ర:

రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడిని పెంచబోతున్న రెండు పట్టభద్రుల శాసనమండలి స్థానాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ మధ్య పోరు తీవ్రరూపం దాల్చింది. పదవీకాలం ముగియడానికి ఇంకా అయిదు ఆరు నెలల సమయం ఉన్నప్పటికీ ఆశావహులైన నాయకులు ఇప్పటి నుంచే ఢిల్లీ పెద్దల చుట్టూ, హైదరాబాద్ లో ముఖ్యమంత్రి, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పదవుల కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న నాయకులకు ఈ రెండు స్థానాలు ఆశల కిరణంగా మారాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానం ఒకటి కాగా, రెండవది ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానం. ఈ రెండు స్థానాలు కేవలం ఒక శాసనమండలి పదవి కోసం మాత్రమే కాదు. విద్యావంతులు, నిరుద్యోగులు, యువత ఏ పార్టీ వైపు ఉన్నారో తెలిపే కొలమానంగా కూడా నిలవనున్నాయి. అందుకే మూడు ప్రధాన పార్టీలు ఈ స్థానాలను ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని వ్యూహాలు రచిస్తున్నాయి. మిగతా 2లో..

# రోడ్ల అభివృద్ధిలో నాణ్యతకు రాజీ లేదు

- రోడ్డు నెట్‌వర్క్‌కు ఏకీకృత వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశం
- ఓఆర్ఆర్ నిర్వహణ మెరుగుపర్చాలి..
- టీడీఆర్ పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలి
- హెచ్ఎండీఏ, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష..

హైదరాబాద్, ఆగస్టు 6: హైదరాబాద్ నగర భవిష్యత్ అభివృద్ధికి సమగ్ర రోడ్డు నెట్‌వర్క్ అత్యంత కీలకమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



(మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి) జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోడ్లకు సంబంధించిన భూసేకరణ, రుణాలు, నిర్మాణం, నిర్వహణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) తదితర అన్ని అంశాలను ఒకే సమగ్ర డిజిటల్ వ్యవస్థలోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) వ్యవస్థపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం సేకరించిన భూములకు మిగతా 2లో..

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

హైదరాబాద్,ఆగస్ట్6 : తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల మిగతా 2లో..

## సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

- నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక,
- రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు,
- బొగ్గు రాకపై డిప్యూటి సీఎం భట్టి ఆనందం

మంచిర్యాల,ఆగస్ట్6 : సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59



వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. మిగతా 2లో..



## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

హైదరాబాద్,ఆగస్ట్6 : ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



ఖమ్మం,ఆగస్ట్6 : ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా మిగతా 2లో..

## గోదావరి ప్రాజెక్టులకు సమాధి

- ఎపి డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్ఎంబీ
- తెలంగాణకు జై అనని రేవంత్ సిఎంగా ఉన్నారు
- జయశంకర్ ఆరాటం.. కెసిఆర్ పోరటంతోనే తెలంగాణ సాకారం
- జయశంకర్ జయంతి సందర్భంగా నివాళి అర్పించిన హరీష్ రావు

మిగతా 2లో..



## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్,ఆగస్ట్6 : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మిగతా 2లో..



## విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు
- ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

ముంబై,ఆగస్ట్6 :కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని మిగతా 2లో..

# దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024ల ఉపసంహారణ

- యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదం
- రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు
- కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు
- అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపు
- ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి,ఆగస్ట్6 : పలు కీలక నిర్ణయాలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దిశ



బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి.. మరింత పటిష్ఠ చట్టాల రూపకల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కేబినేట్ అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. మున్సిపల్ భూముల లీజు గడువు పెంపునకు చట్టసవరణల ప్రతిపాదన, యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మిగతా 2లో..

# జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని

- రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా
- డిఎస్సీపై కావాలనే నానా యాగీ చేస్తున్నారు
- పొగాకు రైతుల వద్దకు వెళ్లి హంగామా చేశారు
- రైతన్నల పొలాలను ధ్వంసం చేసి..వారిని క్షోభ పెట్టారు
- జగన్ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి
- కేబినేట్‌లో మంత్రులతో సిఎం చంద్రబాబు



అమరావతి,ఆగస్ట్6 : జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు. అన్ని విషయాలు డీఎస్సీపై మనం ప్రజలకు వివరించామని అన్నారు. వైసీపీ నేతలు కోర్టులతో కూడా చీవాట్లు పడ్డారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మూడున్నర గంటల పాటు ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్థానిక ఎన్నికలకు మంత్రులు, కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల చీవాట్లు పెట్టినా వైసీపీ నేతలు యాగీ చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వైసీపీ నేతలకు అసలు రిజర్వేషన్ల గురించి తెలియదని విమర్శించారు. డీఎస్సీలో హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై.. అందరికీ తెలపాల్సిన మిగతా 2లో..

## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.

## సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు.మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## రోడ్ల అభివృద్ధిలో నాణ్యతకు రాజీ లేదు

మాత్రమే టీడీఆర్ వర్తించేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. టీడీఆర్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శక వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్-1 పనులను డిసెంబర్ 9లోగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి, పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని స్పష్టం చేసిన సీఎం, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా మట్టి నాణ్యతతో పాటు నిర్మాణ ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బద్వేల్ ఇంటర్‌చేంజ్ ట్రంపెట్ నిర్మాణం అత్యంత కీలకమని పేర్కొన్న సీఎం, ఎలివేటెడ్ కారిడార్-1, 11 పనులను వేగవంతం చేయాలని, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ఎలివేటెడ్ కారిడార్-3 పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అధికారులు అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. రోడ్ల ప్రణాళిక, నిర్మాణ దశల నుంచే ట్రాఫిక్ విభాగాన్ని భాగస్వామ్యం చేయాలని, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని

బాధ్యత మంత్రులదేనని ఆదేశించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిన్న దేవరపల్లిలో పర్యటన సందర్భంగా రైతన్నల పొలాలను గొడ్డలి పార్టీ శ్రేణులు నాశనం చేశాయని ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్టగొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడం ఆక్షేపణీయమని అన్నారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని ఆగ్రహించారు. అనేకమంది రైతులు తనకు మెసేజ్‌లు పంపారని తెలిపారు. తమ పంట దెబ్బతిందని అన్నదాతలు తనకు వివరించారని అన్నారు. చివరకు జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ నెలాఖరుకు వెలుగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీటి కోసం నీళ్లు ఇస్తామని వెల్లడించారు. ఎల్‌నినో గురించి మంత్రులు ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంత వర్షాభావం ఉన్న కూడా మంచినీటికి కూడా మనం నీళ్లు ఇస్తున్నామనేది ప్రజలకు వివరించాలని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా తొలిసారి థింసా గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చిందని ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఓ సెంటిమెంట్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అక్కడ ల్యాండింగ్ కూడా సముద్రం మీద నుంచి వచ్చే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ఈ రెండు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంత్రుల ప్రసంగాల్లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్వాంటం వ్యాలీ జనవరిలో ప్రారంభమవు తుందని ప్రకటించారు. 'దిశా' అనేది అసలు చట్టం రూపం నోచుకోలేదని సీఎం తెలిపారు. అయినా 'దిశా' పోలీస్ స్టేషన్లు, వాహనాలని చెప్పి హడావుడి చేశారని దుయ్యబట్టారు. 'దిశా' చట్టం అని పంపితే కేంద్రప్రభుత్వం తిరస్కరించి వెనక్కు పంపిందని ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లుగా మందు తాగించి ప్రజలను తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా రూ.1100కోట్లు విద్యుత్ రాయితీలు ఇచ్చామని ప్రస్తావించారు. ఆక్వా ఫీడ్ ఎక్స్‌పోర్ట్ 50శాతం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు 11 రాష్ట్రాల్లో ఉన్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు సాధ్యమైనంతవరకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూములు వేలం వేయడంలో సరైన ధర రావాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేలంతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా చూడాలని కేబినెట్ సబ్ కమిటీకు సూచించారు. ఇప్పటికే 15 ఏళ్లు పూర్తి అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కేబినెట్ సబ్ కమిటీ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ఈ నెల 13వ తేదీన సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో సీఎం కాన్వాయ్ ప్రయాణించి నేరుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు వస్తుందని వెల్లడించారు. అక్కడ వాటి తాళాలను ముఖ్యమంత్రికి అందజేస్తారని చెప్పారు. విజయదశమి నాటికి మంత్రుల క్వార్టర్స్‌ను సిద్ధం చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

### సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం

# సమరసతకు చిరునామా

అనుభూతి సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించాను' అని గవర్నర్ అన్నారు. ముచ్చింతల్‌లోని శ్రీ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఆధ్యాత్మికత, సమరసత, సమానత్వ విలువలకు చిరస్థాయిగా నిలిచే దివ్యక్షేత్రమని ఆయన అన్నారు. గురువారం తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి తొలిసారిగా సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రం తనకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. బ్యాటరీ వాహనంలో స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించిన ఆయన దంపతులు, సమతామూర్తినీ దర్శించుకున్నారు.వేద పండితులు గవర్నర్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం 216 అడుగుల ఎత్తైన శ్రీ రామానుజాచార్యుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు.తదనంతరం సమతా మూర్తి కేంద్రంలోని 108 దివ్యదేశాల విశిష్టతను తెలుసుకున్నారు. కేంద్ర విశేషాలను అహోబిల జీయర్ స్వామి, కృష్ణ స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వైకుంఠనాథ భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరగా స్వామీజీ కుటీరంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిని గవర్నర్ దంపతులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజాచార్యుల విశిష్ట సేవలు, విశిష్టాద్వైత తత్వం, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణ లక్ష్యం, ఇక్కడ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి జీయర్ స్వామి వివరించారు. అనంతరం గవర్నర్ దంపతులను శాలువాతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి సత్కరించి సమతా మూర్తి ప్రతిమ, భగవత్ రామానుజ పుస్తకాన్ని , శ్రీ రామానుజచార్యుల వారి జీవిత చరిత్ర, చిత్ర కథ, సత్య సంకల్ప పుస్తకాలు సహా పలు పుస్తకాలను బహుకరించారు. ఆశీస్సులు అందజేశారు. గవర్నర్ స్వామివారికి మెమెంటో అందించారు. సమతా మూర్తి విగ్రహం సమరసతకు, సామాజిక సమానత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఒకటిగా నిలిచిందన్నారు. వేదాలు బోధించిన విలువలను శ్రీ రామానుజాచార్యులు తమ జీవితంలో ఆచరించి చూపారని కొనియాడారు. వెయ్యేళ్ల క్రితమే జాతి, భాష, వర్ణ భేదాలకు అతీతంగా సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మహనీయుడని పేర్కొన్నారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పి భక్తి ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆధ్యాత్మిక విప్లవకారుడిగా శ్రీ రామానుజులను అభివర్ణించారు. దేవుడిని ఆరాధించడం, మోక్షాన్ని పొందడం ప్రతి మానవుడి హక్కు. ఆ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు. దేవుని దృష్టిలో అందరూ సమానులే" అనే శ్రీ రామానుజాచార్యుల సందేశం యుగయుగాలకు మార్గదర్శకమని గవర్నర్ అన్నారు. వ్యక్తిగత శ్రేయస్సుకంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమనే ఆయన బోధనలు నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. సందర్శన అనంతరం సందర్శకుల పుస్తకంలో గవర్నర్ తన అభిప్రాయాన్ని నమోదు చేశారు. ముచ్చింతల్‌లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని తొలిసారిగా సందర్శించానని, ఈ దివ్యక్షేత్రం నాకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని అన్నారు. సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం లభించిందని వివరించారు. ఈ మహత్తర కేంద్రాన్ని నిర్మించిన స్వామీజీ, జీయర్ స్వామి, వారి బృందానికి హృదయపూర్వక అభినందనలు అని రాసి సంతకం చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై పార్టీల కసరత్తు

**పాలమూరు-రంగారెడ్డి -హైదరాబాద్ స్థానం?**
**- సంచలనాలకు నిలయం**

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల స్థానం చరిత్రలో ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. 2015 మరియు 2021 సంవత్సరాల్లో ఆచార్య కోదండరామ్ నాగేశ్వర్ వామపక్షాల మద్దతుతో బరిలోకి దిగి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లాంటి అగ్ర పార్టీలను సైతం అధిక మెజార్టీతో ఓడించి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో అప్పుడు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితిని ఢీకొని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు కమలం జెండా ఎగరేశారు. గతంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానం మరింత రసవత్తరంగా మారింది. భారతీయ జనతా పార్టీ నుంచి ప్రస్తుత శాసనమండలి సభ్యుడు రామచంద్రరావు, భారత రాష్ట్ర సమితి నుంచి మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కుమార్తె సురభి వాణిదేవి, కాంగ్రెస్ మరియు ప్రతిపక్షాల తరపున మాజీ శాసనమండలి సభ్యుడు నాగేశ్వర్, కొల్లాపూర్ కు చెందిన విద్యావేత్త గల్లా రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పోటీ పడ్డారు. అప్పటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ ప్రభావం, పి.వి. గారి పలుకుబడి కలిసి రావడంతో సురభి వాణిదేవి విజయం సాధించారు. ఇప్పుడు ఆమె పదవీకాలం త్వరలో ముగియడంతో ఈ స్థానం మళ్లీ అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ సారి యువతను ఆకర్షించే అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తోంది. ఈ స్థానం కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ అధ్యక్షుడు సామ రామ్మోహన్ రెడ్డి, గతంలో పోటీ చేసిన అనుభవం ఉన్న గల్లా రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ముఖ్యమంత్రి సన్నిహితుడు ఫాయుమ్ ఖురేషి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మన్నె జీవన్ రెడ్డి పేర్లు ముందు వరుసలో వినిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ ఇక్కడ ఒకసారి గెలిచిన చరిత్ర ఉండడంతో ధీమాగా ఉంది. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.వి. సుభాష్, లంకాల దీపక్ రెడ్డి, పోతుగంటి భరత్ పేర్లు చర్చలో ఉన్నాయి. భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రస్తుత స్థానాన్ని కాపాడుకునేందుకు సీనియర్ నాయకుడు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, పార్టీ యువ నాయకుడు క్రిశాంక్ లతో ప్రయత్నాలు చేస్తోంది.

**ఖమ్మం-నల్గొండ-వరంగల్ స్థానం - మూడు జిల్లాల ప్రతిష్ట**

ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల స్థానం కూడా అంతే కీలకం. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన శాసనసభ సభ్యుడిగా గెలవడంతో ఈ పదవికి రాజీనామా చేశారు. ఆ తదనంతరం జరిగిన ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ విజయం సాధించారు. ఇప్పుడు ఆయన పదవీకాలం కూడా ముగియనుండడంతో ఈ స్థానంపై కూడా పోటీ హీటెక్కింది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున మాజీ శాసనమండలి సభ్యుడు విజయసారథి రెడ్డి, రాములు నాయక్, యువనేత డి. శ్రావణ్ టికెట్ ఆశిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, యువ నాయకుడు బాల్క సుమన్, మాజీ శాసనసభ సభ్యురాలు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేసులో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. నల్గొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆశీస్సులు ఉన్నవారికి కూడా అవకాశం ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అనూహ్య పేరు - కాంగ్రెస్ లో గుసగుసలు**

ఈ రెండు స్థానాలకు చాలా మంది పోటీ పడుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక అనూహ్య పేరు తెరపైకి రావడంతో పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. అది కల్వకుర్తి మాజీ శాసనసభ సభ్యుడు చల్లా వంశీచంద్ రెడ్డి పేరు. గతంలో జాతీయ విద్యార్థి సంఘం మరియు యువజన కాంగ్రెస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన ఆయన గత రెండు పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్ నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయినప్పటికీ అధిష్టానంతో సన్నిహితంగా ఉంటూ ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితునిగా కొనసాగుతున్నారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో బాధ్యుడిగా కూడా నియమితులవుతున్నారు. ప్రస్తుతం జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో వంశీచంద్ర రెడ్డి పోటీ చేసి విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో చేరాలని భావిస్తున్నారని ఆయన వర్గీయుల్లో చర్చ మొదలైంది. అయితే ఇదే జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వంశీచంద్ రెడ్డి మధ్య అంతర్గతంగా కొన్ని విభేదాలు ఉన్నాయని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో రేవంత్ రెడ్డి,వంశీచంద్ రెడ్డి అభ్యర్థిత్వానికి ఎంతవరకు సహకరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

**పార్టీల లక్ష్యం ఒకటే - యువతను ఆకర్షించడం**

ఈ రెండు స్థానాలు పట్టభద్రులతో పాటు యువత, నిరుద్యోగులను ప్రభావితం చేస్తాయి. అందుకే మూడు పార్టీలు యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలా లేదా అనుభవం ఉన్న సీనియర్ లకు టికెట్ ఇవ్వాలా అనే దానిపై చర్చలు జరుపుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ పార్టీలు ఇప్పటి నుంచే ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి.

## విద్య వ్యాపార వస్తువుగా మారింది

ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరపున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

**దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024ల ఉపసంహరణ**

మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పాదచారుల భద్రత పాలసీ-2026, రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు, అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపునకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ట్విన్ టవర్స్ నిర్మాణ బాధ్యతలను ఎల్‌అండ్‌టీకి అప్పగించేందుకు అంగీకారం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు డిజైన్ల కోసం అదనపు నిధులు, అమరావతి భూ కేటాయింపులపై జీవోఎం సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు రీ-టెండర్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాలు ఎపిఐఐసికి బదిలీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. తిమ్మసముద్రంలో 13.45 ఎకరాలు సియుడిఎకు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా యుడిఎ పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని, వాటి సంఖ్య 21 నుంచి 23కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కండలేరు నుంచి పరిశ్రమల క్లస్టర్‌కు నీటి సరఫరాకు కేబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసులకు జఊ÷ూ హక్కులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. 400 హౌసింగ్ యూనిట్ల భూ సమస్యకు కేబినెట్‌లో పరిష్కారం చూపామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ భూ వివాదాల పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అమరావతి 'ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఎత్తైన అమరావతి ఐ నిర్మాణానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు 'అమ్నిబస్ చట్టం-2026' చట్టాన్ని తీసుకొచ్చామని, పెట్టుబడులకు అడ్డంకుల తొలగింపే అమ్నిబస్ చట్టం లక్ష్యమని పార్థసారథి స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు ప్రత్యేక పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. డి-ఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనం రీ-డిజైన్ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఏపీ పిపిపి పాలసీ-2026కు మంత్రిమండలి నుంచి ఆమోదం ముద్ర పడినట్లు చెప్పారు. ఖఖఖ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడుల ఆకర్షణకే కొత్త పిపిపి పాలసీ లక్ష్యమని తెలిపారు. మోతడకలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. హైస్పీడ్ రైలు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూముల సమీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

## గోదావరి ప్రాజెక్టులకు సమాధి

సిద్దిపేట,ఆగస్ట్6 : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు.గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా,ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులు కుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ÷ూఖాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఎ÷-లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి నెలకు నిర్ణీత ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పథకం ద్వారా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ. 4,016 లభిస్తోంది. అంతేకాకుండా ్గ÷ల్గ÷లేరియా బాధితులకు కూడా ప్రతి నెలా రూ. 2,016 ఆర్థిక సాయం అందుతోంది. సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' ద్వారా లబ్దిదారులకు డిజిటల్ మ్యాప్‌తో సహా భూమి హక్కు పత్రాలు అందజేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. అలాగే రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నాడు. అంతే కాకుండా.. రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేదల భరోసా కోసం నిరంతరం శ్రమిస్తుందని ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రజా సమస్యలపై శ్రద్ధపెట్టని పార్లమెంటు !

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబుడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకర్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది.

అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు.

విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి.

గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.




# దేశాన్ని కట్టిపడేస్తున్న పెద్దపల్లి రాఖీలు..

- 'మేడ్ ఇన్ తెలంగాణ'కు జాతీయ ఖ్యాతి
- ఎస్ఆర్ఆర్ రాఖీ పరిశ్రమలో లక్షకు పైగా డిజైన్లు..
- 3 వేల మందికి ఉపాధి.. దేశవ్యాప్తంగా భారీ డిమాండ్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-06(విజన్ ఆంధ్ర) : రక్షాబంధన్ పండుగ సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా రాఖీల సందడి మొదలైంది. ఒకప్పుడు కలకత్తా, ముంబై, రాజస్థాన్ వంటి రాష్ట్రాలపై ఆధారపడిన వ్యాపారులు ఇప్పుడు నేరుగా పెద్దపల్లి జిల్లాకు క్యూ కడుతున్నారు. ఇందుకు కారణం పెద్దపల్లిలోని ఎస్ఆర్ఆర్ రాఖీ పరిశ్రమ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడమే. ప్రముఖ వ్యాపారవేత్త ఇల్లందుల కృష్ణమూర్తి స్థాపించిన ఈ పరిశ్రమ ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద రాఖీ తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఎదిగి, లక్షకు పైగా విభిన్న డిజైన్లలో రాఖీలను తయారు చేస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తోంది. నాణ్యమైన ముడి సరుకులతో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి తయారు చేస్తున్న రాఖీలు అందుబాటు ధరల్లో లభిస్తుండటంతో మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ప్రతి ఏడాది కొత్త డిజైన్లను ప్రవేశపెడుతూ వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా 10 పైసల నుంచి రూ.500 వరకు వివిధ ధరల్లో రాఖీలను అందిస్తున్నారు. భారీ ఆర్డర్లను వేగంగా పూర్తి చేసేందుకు బార్‌కోడింగ్ ఆధారిత బిల్లింగ్ విధానాన్ని అమలు చేయడం ఈ పరిశ్రమ ప్రత్యేకతగా నిలిచింది. ఈ పరిశ్రమ ద్వారా మూడు వేల మందికి పైగా మహిళలు, యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తోంది. రోజుకు రూ.300 నుంచి రూ.800 వరకు ఆదాయం పొందుతున్న మహిళలు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి కొత్త గుర్తింపుగా నిలిచిన పెద్దపల్లి ఎస్ఆర్ఆర్ రాఖీ పరిశ్రమ, రక్షాబంధన్ సందర్భంగా దేశవ్యాప్తంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత మధురంగా మార్చే ప్రతి రాఖీలో తెలంగాణ గర్వాన్ని ప్రతిబింబిస్తోంది.

# తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగం డిమాండ్



ఎల్బీనగర్ ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): తెలంగాణ జాతిపిత, సిద్ధాంతకర్త, కీర్తిశేషులు ప్రొఫెసర్ జయశంకర్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలి ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగాచారి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ జాతిపిత సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్లోని ఆయన విగ్రహానికి ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగాచారితోపాటు పార్టీ రాష్ట్ర నాయకులు నాగార్జునపు రాజ్యలక్ష్మి, శ్యాం ప్రసాద్, ఫిరంగి ధర్మచారి, శ్రీకాంతాచారి, జయకరణ్, ఎల్లంకి లక్ష్మారెడ్డి, కొయ్యడ వెంకటస్వామి తదితరులు పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాండురంగాచారి మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఒక వ్యక్తి కాదు, ఒక సిద్ధాంతం, ఒక సమూహం, ఒక ఉద్యమం, ఒక ఆత్మగౌరవం, ఒక స్ఫూర్తి, సమాన అభివృద్ధితోనే ఒక నిదర్శనానికి మారుపేరే జయశంకర్ సార్ అని కొనియాడారు. 2014లో తెలంగాణ రాష్ట్రం సాధించినప్పటికీ జయశంకర్ సార్ కలలుగొన్న తెలంగాణ ఇంకా పూర్తిగా సహకారం కాలేదన్నారు. కార్మిక కర్షక సంక్షేమం యువతకు ఉద్యోగాలు నాణ్యమైన ప్రభుత్వ విద్య గ్రామీణ అభివృద్ధి వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు పారదర్శక పాలన ఆయన ఆశయాలను పూర్తిగా అమలు చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆయనను గుర్తించి ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటుతోనే సరియైన మార్గమని రాయబండి పాండురంగాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కులతో పాటు ప్రతిభ ప్రదర్శన...

- సెయింట్ మేరీస్‌లో వినూత్న పేరెంట్‌టీచర్ మీట్
- బయాలజీ సైన్స్ ఫేయిర్‌తో కొత్త కార్యక్రమానికి శ్రీకారం
- ప్రతి పీటీఎంలో ఒక్కో సబ్జెక్ట్‌పై ప్రత్యేక ఎగ్జిబిషన్

కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 6(విజన్ ఆంధ్ర) : పాఠశాలల్లో పేరెంట్‌టీచర్ మీట్ (పీటీఎం) అంటే సాధారణంగా విద్యార్థుల విద్యా పురోగతి, మార్కులు, క్రమశిక్షణపై తల్లిదండ్రులతో చర్చించే వేదికగా ఉంటుంది. అయితే కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ స్కూల్ ఈ సంప్రదాయానికి భిన్నంగా ఆలోచించి, విద్యార్థుల మార్కులతో పాటు వారి సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రతిభను తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా పరిచయం చేసే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.పాఠశాలలో నిర్వహించిన పేరెంట్‌టీచర్ మీట్ సందర్భంగా విద్యార్థుల మార్కుల వివరాలను తల్లిదండ్రులకు అందజేయడంతో పాటు, వారు స్వయంగా రూపొందించిన వివిధ నమూనాలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు, విద్యా సంబంధిత వస్తువులతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రూపొందించిన ప్రతి నమూనా వెనుక ఉన్న ఆలోచన, తయారీ విధానం, ఉపయోగాలను తల్లిదండ్రులకు స్వయంగా వివరిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారంగా తొలిసారిగా బయాలజీ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. జీవశాస్త్రానికి సంబంధించిన మానవ శరీర నిర్మాణం, మొక్కలు, జంతువులు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతి ప్రాజెక్టును విద్యార్థులే వివరిస్తూ తమలోని శాస్త్రీయ అవగాహన, పరిశోధనా దృక్పథాన్ని చాటిచెప్పారు. సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పుస్తకాల్లో చదివిన విషయాలను ఆచరణలో చూపించే విధంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, నేర్చుకున్న విషయాలపై మరింత అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మేరిజాన్, ప్రధానోపాధ్యాయిని సిస్టర్ నిర్మలా పోలిశెట్టి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా సృజనాత్మకంగా ఆలోచించేలా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునేలా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందుకే ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి పేరెంట్‌టీచర్ మీట్ సందర్భంగా ఒక్కో సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రత్యేక సైన్స్ ఫెయిర్ లేదా ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సామాజిక శాస్త్రం, భాషలు తదితర అంశాలపై కూడా రానున్న పీటీఎంలలో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి, విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం మరింత పెంపొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా పురోగతితో పాటు వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకత, ప్రదర్శనా నైపుణ్యాలను కూడా గుర్తించి ప్రోత్సహించే దిశగా సెయింట్ మేరీస్ స్కూల్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వారు హర్షిస్తూ, పిల్లల సమగ్ర వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని పేర్కొన్నారు.




# విద్యార్థులను దగా చేస్తున్న "ఐఏసీఈ కోచింగ్ సెంటర్"!!

- తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను మోసం చేస్తున్న ఐఏసీఈ కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలి
- ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆందోళన, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




ఎల్బీనగర్ ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు, నిరుద్యోగులు అనే లక్ష్యంగా చేసుకొని మోసపూరిత తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను నట్టేట ముంచుతున్నటువంటి ఎల్బీనగర్ నియోజకవర్గం దిల్సుఖ్ నగర్ ఐఏసీఈ కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆందోళన నిర్వహించారు. కోచింగ్ సెంటర్ ఆవరణలో ఆందోళన నిర్వహించిన అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దిల్సుఖ్ నగర్ గడ్డిఅన్నారంలోని ఐఏసీఈ కోచింగ్ సెంటర్ లో సిబిటి -2 ఫ్రీ పరీక్ష పేరుతో విద్యార్థుల నుండి రిజిస్టేషన్ నంబర్స్ తీసుకొని మా కోచింగ్ సెంటర్ నుండి ఆర్ఆర్బీ, ఏఎల్ పి, (అసిస్టెంట్ లోకో పైలట్), ఎన్.టి.పి.సి సీబీటీ-1కి అర్హత సాధించారని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం నేరపూరితమైన చర్య వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేసే కుట్రలో భాగంగానే తప్పుడు ప్రకటనలు, ఫలితాలతో విద్యార్థులను మోసం చేస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్న ఐఏసిఈ కోచింగ్ సెంటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కోచింగ్ సెంటర్ లో కోచింగ్ తీసుకొని విద్యార్థులను తమ విద్యార్థులుగా వ్యాపార ప్రకటనలు చేయడం సరియైన పద్ధతి కాదన్నారు. ఉత్తర భారత దేశంకి సబంధించిన విద్యార్థులు పేర్లను చూపిస్తూ తప్పుడు పేర్లను తమ కోచింగ్ విద్యార్థులుగా చెప్పుకోవడం మోసం పూరితమైన చర్యలుగా వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నియమాల ప్రకారం విద్యార్థుల నుండి కన్సర్న్ లెటర్ తీసుకోకుండా ప్రకటనలు చేయడం అమాయకమైన విద్యార్థులను మోసం చేయడం అని వారు తెలిపారు. తప్పుడు పలితాలు, వ్యాపార ప్రకటనలతో నష్టపోయిన బాధిత విద్యార్థులకి న్యాయం చేయాలి అని వారు తెలిపారు. మోసపూరితమైన ప్రకటనలు, పలితాలుతో విద్యార్థులను మోసం చేస్తున్న ఐఏసిఈ యాజమాన్యంపై చట్టా రిత్యా చర్యలు తీసుకోవాలి అని వారు డిమాండ్ చేశారు. అనంతరం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్, డి ఎస్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శేషు, పిడిఎస్ యూ వెంకటేష్, టీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు భారీ అశోక్, టీఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎం శ్రీకాంత్, జనసేన విద్యార్థి నాయకులు బండి నరేష్ మాదిగ, దండోరా అధ్యక్షులు నకిరేకంటి సైదులు మాదిగ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య,బీసీ విద్యార్థి జేఏసీ మామిడాల రవికుమార్, మాదిగ యూత్ జాక్ అధ్యక్షుడు మీసాల మహేష్, వి ఆర్ ఎస్ వి ప్రవీణ్, నక్క సుధీర్, విద్యార్థి నాయకులు చిరంజీవి, వెంబడి గణేష్, సిద్దుయాదవ్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# తిజ్‌ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ భూక్య భాస్కర్



నల్లబెల్లి,ఆగస్టు6, విజన్ ఆంధ్ర : తెలంగాణ పండుగలలో ఒక్కో పండుగ ఒక్కో సంప్రదాయాన్ని తెలియజేస్తుంది. ముఖ్యంగా అతి పెద్ద పండుగ దసరా. సుమారు 9 రోజుల పాటు బతుకమ్మ ను పూజించి తెలంగాణ లోని ఆడపడుచులు 9 రోజుల పాటు ఆడి పాడి జరుపుకునే అతి పెద్ద పండుగ. ఇన్ని రోజులు జరుపుకునే ఒకే పండుగ అని అనుకుంటాము కానీ సుమారు 9 రోజుల పాటు జరుపుకునే పండుగ మరొకటి ఉంది. ఆ పండుగ విశేషాలు మాత్రం కొద్ది మందికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా పట్టణాల్లో నివసించే వారికి మొత్తానికే తెలిసి ఉండదు. ఈ పండుగ గిరిజనులకు మాత్రమే సొంతం. కేవలం గిరిజనులు మాత్రమే వారి సంప్రదాయాల్లో సుమారు తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను అతి పెద్ద పండుగ. ప్రతి రోజూ వారి సంప్రదాయాల్లో ఆటలు పాటలు పాడుతుంటారు. తీజ్ పండుగను సేవా భాయ్ దండియాడి అనే దేవత జరిపిస్తుందని గిరిజనులు విశ్వసిస్తారు. అందుకే ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు గిరిజనులు. ఈ పండుగ గిజనుల కుటుంబాల్లో ప్రతి రోజూ ప్రత్యేకతను సంచరించుకుంటుందీ. ముఖ్యంగా ఇందులో 7వ రోజు దమోలి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లో బియ్యంతో చేసిన పిండితో రొట్టెలు చేస్తారు. బెల్లం కలిపి ముద్దలు చేస్తారు. తీజ్ బట్టలు ఉన్న అవరణలో సేవాభాయి, మెరమల పూజలు నిర్వహిస్తారు. మెరమల పూజ గోనె సంచిలో జొన్నలు నింపి దాంట్లో నీళ్ళు పోసి వేప మండలు వేసి మేకపోతులను పసుపుతో రాసి వేప మండలను కట్టి బలి ఇవ్వడం వారి సంప్రదాయం.

**చివరి రోజు ప్రత్యేకత..**

9 రోజులు పూజించిన తరువాత నిమజ్జన వేడుకలు సంప్రదాయంగా ఘనంగా నిర్వహించుకుంటారు. పెళ్లి కాని యువతులు కొత్త ఉదయం ఇంటి ఇంటికి వెళ్లి ఉయ్యాల ఆట ఆడుతారు. రెండు బొమ్మలను ఉయ్యాలలో పెట్టి ఊపుతూ ఆటలు పాటలతో సందడి చేస్తారు. ఇక నవ ధాన్యాలు బుట్టల వద్ద ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అనంతరం నిమజ్జనం వేడుక కన్నుల పండుగ జరుపుకుంటారు. ఊరంతా డీజే బాక్సులతో, డప్పు చప్పుళ్లతో ఆటపాటలతో అడుతు డాన్సులు చేస్తూ ఘనంగా నిర్వహించుకుని ఆ ప్రాంతంలో నీటిలో నిమజ్జనం చేస్తారు. ఇది గిరిజన కుటుంబాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయశీ.

# ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ఆగస్టు 6,(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం కోసిని గ్రామ శివారులో గల 79, 80 సర్వే నెంబర్లలో గల ప్రభుత్వ భూమిని కాగజ్ నగర్ రాజస్వ అధికారి చెన్నూరి కిష్టయ్య, రెవిన్యూ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కాపు వాడలో ఓ వ్యక్తి రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నాడని, ఓ వెంచర్ లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు చేశారని వచ్చిన ఆరోపణలపై అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు హద్దులు నిర్ధారించి స్వాధీన పరుచుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరచిన కాన్స్టేబుల్ ళ్లకు నగదు పురస్కారం



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 6 ( విజన్ ఆంధ్ర ) : రెండు రోజుల క్రితం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట గ్రామ సమీపంలో ఉన్న సాయినాధ్ వెంచర్ నందు మెరుగు పవన్ తీ/శీ కరీమాబాద్ అనునతడు ఆర్థిక సమస్యలతో ఒంటి మీద పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకొన్నది చూసి సహసోపేతంగా అతడిని రక్షించి సకాలంలో అతడిని ఆసుపత్రి లో చేర్చడంలో ముఖ్య పాత్ర పోషించిన మడికొండ పోలీస్ కాన్స్టేబుల్ అయినా సంపత్ మరియు గోవర్ధన్ లను వారి సేవలను గుర్తించి గౌరనీయులైన వరంగల్ పోలీస్ కమీషనర్ శ్వేత రెడ్డి ఐపీఎస్ నగదు పురస్కారం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమీషనర్ శ్వేత రెడ్డి ఐపీఎస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణం కాపాడడం అనునది చాలా గొప్ప విషయం విధి నిర్వహణ లో ఉత్తమప్రతిభ కనబరిచిన వారిని తప్పనిసరిగా గుర్తిస్తాము. అని తెలిపారు. ఈ కార్యక్రమం లో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మేడం మరియు మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మరియు ఎస్సై లు రాజబాబు మరియు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థులు సైబర్ క్రైమ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 6 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు తాళ్ళ పద్మావతి కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరాలు తెలిపారు. ఇందులో భాగంగా గౌరవ నీయులైన తెలంగాణ పోలీస్ డీజీపీ సి . వి . ఆనంద్ ఐపీఎస్ మరియు డీజీపీ శిఖా గొయల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో సురక్ష కా తిరంగా కార్యక్రమం ద్వారా ప్రజలందరికి సైబర్ నేరాల పట్ల అవగాహనా కల్పించడం కోసం వరంగల్ పోలీస్ కమీషనర్ శ్వేతా రెడ్డి ఐపీఎస్ ఆదేశానుసారం ఎవరు కూడా సైబర్ క్రైమ్ బారిన పడకూడదు అని సూచించారు. ముఖ్యంగా ఫైనాన్సియల్ నాన్ ఫైనాన్సియల్ ఫ్రాడ్స్ మరియు సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్, డిజిటల్ అరెస్ట్, ఐడెంటిటీ తెఫ్ట్ లోన్ యాప్ ఫ్రాడ్స్, న్యూడ్ వీడియో కాల్స్, మొదలగు వాటి గురించి వివరించారు. సైబర్ క్రైమ్ నేరం చేసే వాళ్ళు మన ఫోన్ కు మెసేజ్ కానీ లింక్ కానీ పంపి దాని ద్వారా మన అకౌంట్ లో ఉన్న డబ్బులు తీసుకోవడం చేస్తారు. మహిళల పట్ల సోషల్ మీడియా లో అనుచిత వ్యాఖ్యలు చేస్తారు. అందరు వాటికి దూరం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**-మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్**



వరంగల్: ఆగస్టు 6, విజన్ ఆంధ్ర: నర్సంపేట పట్టణం మల్లంపల్లి రోడ్డులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ . ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ చుక్కాని తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటిన మహోజ్ఞాని తెలంగాణ సిద్ధాంతకర్త, మన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు, తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్నే అంకితం చేసి స్వరాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహనీయులు ఆచార్య ప్రొఫెసర్ శ్రీ కొత్తపల్లి జయశంకర్ అన్ని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరామోజ్ రోజారాణి, కాంపెల్లి వీణవిజేందర్ రెడ్డి, బీరం భరత్ రెడ్డి, పొన్నాల మనీషప్రకాష్, బాణాల ప్రసన్నశ్రీనివాస్, దొంగల రజితసురేష్, మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమలసదానందం, అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుదర్శన చారి, గౌరవ అధ్యక్షులు కేసోజు రావన్న, మొగలోజు కోటి లింగాచారి, శ్రీపెల్లి రవి, భద్రయ్య, రవీందర్, వద్యాలపు నరేష్, కాసుల యుగంధర్, పబోజు సత్యనారాయణ, కాసుల లింగాచారి, దేవోజు హేమంత్, తదితరులు పాల్గొన్నారు..

# మహిళా సంఘాల సభ్యులు ఉపాధి అవకాశాలతో బలోపేతం కావాలి

**- తీసుకున్న రుణాలు ఆగస్టు 30 లోపల చెల్లించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వ్యాపార, ఇతర ఉపాధి అవకాశాలు పొంది ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సెర్ప్, మెప్మా ద్వారా ప్రతి ఏటా పెద్ద ఎత్తున మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నప్పటికీ ఎంతమంది వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రుణాలతో చిన్నచిన్న వ్యాపారాలు కాకుండా ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేసేలా సృజనాత్మకతతో ఆలోచించి ముందుకెళ్లాలన్నారు. పౌల్ట్రీ, డెయిరీ, ఫిషరీస్, తదితర పాడి పరిశ్రమ అభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర ఉండేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులే సొంతంగా ఎలక్ట్రికల్ ఆటోలు, మినీ వ్యాన్లు వంటి వాహనాలు కొనుగోలు చేసి ఆదాయం పొందేందుకు కృషి చేయాలన్నారు. పాత సంఘాలకే రుణాలు ఇవ్వడం కాకుండా స్నేహ కమిటీలు, ఇతర సంఘాల సభ్యులు సైతం వడ్డీ లేని రుణాలను పొంది ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుంటే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఈ విషయంలో సంబంధిత సీసీలు, ఏపిఎంలు పురోగతి సాధించాలన్నారు. జిల్లాలో మొత్తం 9600కు పైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇందులో కొంతమంది తీసుకున్న రుణాలను చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో ఈనెల 30వ తేదీలోగా చెల్లించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రుణాల వసూలులో పురోగతి ఉండేలా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలు తీసుకునే రుణాల సద్వినియోగంకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ అవసరమని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు కుడుతున్న ఏకరూప దుస్తులను విద్యార్థులకు సకాలంలో అందజేసేలా ప్రక్రియను వేగవంతం చేయించాలన్నారు. గ్రామైక్య సంఘాల భవనాల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, స్త్రీ నిధి జోనల్ మేనేజర్ రవికుమార్, రీజనల్ మేనేజర్ సందీప్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతమ్మ, డిపిఎంలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# "గాట్స్ 2004" ఒప్పందంతోనే భారతీయ విద్యావ్యవస్థ వినాశనం!!

**- విద్యను వ్యాపార సరుకుగా మార్చే గాట్స్ ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలి**

**- పిడిఎస్ యూ రాష్ట్ర విద్యా ,వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్ కన్నా డిమాండ్**



ఎల్బీనగర్ ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): భారతీయ విద్యావ్యవస్థలో గాట్స్ ఒప్పందమే విద్యావ్యవస్థ వినాశనానికి కారణమైందని, విద్యను వ్యాపార సరుకుగా మార్చే గాట్స్ ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలని పిడిఎస్ యూ రాష్ట్ర విద్యా ,వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్ కన్నా డిమాండ్ చేశారు. గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట బిజెఆర్ భవన్ లో జరిగిన పిడిఎస్ యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో భాగంగా రెండవ రోజు పిడిఎస్ యూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్ కన్నా హాజరై విద్యారంగ ప్రస్తుత పరిస్థితులు, విద్యార్థుల కర్తవ్యాలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యను వ్యాపార సరుకుగా మార్చే జనరల్ అగ్రిమెంట్ ఆఫ్రేడ్ ఇన్ సర్వీసెస్ గాట్స్ ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలన్నారు. ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (పిడిఎస్ యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఈ విజయ్ కన్నా డిమాండ్ చేశారు. 2004 జెనీవాలో జరిగిన గాట్స్ ఒప్పందం వలన దేశ విద్యారంగంలోకి విచ్చలవిడిగా విదేశీ ప్రైవేట్ యూనివర్సిటీలు వస్తున్నాయని, ఈ విధానం మూలంగా విద్య మరింత వ్యాపార మయం అయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో భారతదేశ సామాజిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నదని ఫలితంగా అంతరాలు పెరిగి సామాజిక సంక్షోభాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర ఏళ్లుగా విద్యార్థులకు , నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యిందని, ఇప్పటికీ ప్రకటిస్తామన్న రెండున్నర లక్షల జాబ్ క్యాలెండర్ ఊసే లేదని ఆయన తెలిపారు. విద్యా భరోసా కార్డు హామీ ఇంకా నెరవేర్చలేదని దాదాపు 11 వేల కోట్ల ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు విద్యారంగ భవిష్యత్తును ప్రశ్నార్ధకంగా మార్చివేస్తున్నాయని, విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని చెప్పి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు పేరుతో 27వేల ప్రాథమిక ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేయడం వలన ఆదివాసి, గిరిజన మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి నిరుపేద విద్యార్థులకు విద్యను అభ్యసించే హక్కును కోల్పోనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యా వ్యవస్థను పర్యవేక్షించడానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యారంగంలో దాదాపు ప్రభుత్వ యూనివర్సిటీలు నిధులు కేటాయింపు లేక, బోధన బోధనేతర సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఇతర అనేక సమస్యలతో కునారిల్లుతున్నాయన్నారు. వాటి అభివృద్ధి విషయంలో ఆంధ్ర పాలకుల కంటే తెలంగాణ పాలకుల తీవ్ర నష్టం చేకూర్చుతున్నారని విమర్శించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రైవేటు యూనివర్సిటీలలో అటానమస్ కళాశాలలలో అవకతవకలు, అక్రమాలపై తనిఖీలు చేసేందుకు నియమించబడిన కాలేజీ ఎడ్యుకేషన్ కమిషన్ సమగ్రంగా నిష్పక్షపాతంగా పనిచేసే అక్రమాలకు పాల్పడిన ప్రైవేట్ కళాశాలలను, యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్రంలోని మోడీ ఫాసిస్టు పాలనలో విద్యార్థి యువత తీవ్ర నిరుద్యోగాన్ని అనుభవిస్తున్నదనీ, విద్యారంగాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని అందుకే నీటి పరీక్ష పత్రాల లీకేజీ పై పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఎన్నడూ లేనంతగా విద్యార్థి యువత ఉద్యమించిందనీ విద్యార్థి పోరాట ఫలితంగానే కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇది విద్యార్థుల విజయమని అన్నారు. ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై ప్రశ్నించినందుకు విద్యార్థి యువతను దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని, సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని విద్యార్థులు నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్, పిఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఇ.విజయ్ పిడిఎస్ యూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవెల్ గణేష్, పిడిఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి సతీష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. బి. వంశీ కుమార్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేంద్రంలో మార్పురావాలి- ప్రజలకు మేలుచేసే ప్రభుత్వం రావాలి

**- సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి**




ఉండవెల్లి ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రల్లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచిపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో ప్రజలకు మేలు జరగాలంటే కేంద్రంలో ప్రజానుకూల మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరల పెరుగుదలను వెంటనే నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రతి పౌరుడికి నాణ్యమైన ప్రభుత్వ విద్య, ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, చదువుకున్న ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆమె కోరారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించి, రైతుల ఆదాయానికి భరోసా ఇవ్వాలని అన్నారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, కార్మికుల చట్టబద్ధ హక్కులను పరిరక్షించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను విరమించి, ప్రజా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. అలాగే సెప్టెంబర్ 1న సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, ధరల నియంత్రణ, ఉపాధి, విద్య, వైద్యం, రైతులుకార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ జాతీయ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, సోషల్ మీడియా రాష్ట్ర ఇంచార్జి సురవరం కపిల్ లు కోరారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ఉండవెల్లి మండల నాయకుడు రవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

**- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**- జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన ఉద్యమ మేధావి, ప్రముఖ విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం సిద్ధాంతబద్ధంగా పోరాడిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆయన ఆలోచనలు నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమని అన్నారు.సమాజం పట్ల బాధ్యత, నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల నిబద్ధత వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని, ఆచార్య జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని జిల్లా పోలీసు శాఖ మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తుందని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బంది ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఇస్లావత్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహేశ్వరం జిజిహెచ్ లో ఉత్సాహంగా బోనాల పండుగ

**- అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్**



ఎల్బీనగర్ ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం బి.ఎన్.రెడ్డి నగర్ లోని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, మహేశ్వరం జిజిహెచ్ ఆసుపత్రిలో గురువారం తెలంగాణ సంస్కృతిలో భాగమైనటువంటి బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్నటువంటి శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ ఆసుపత్రి వైద్యుల బృందం, సిబ్బందితో కలిసి ఆయన అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని రోగులకు త్వరగా ఆరోగ్యం కుదరాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించమన్నారు. అమ్మవారి సన్నిధిలో బోనాల పండుగ ఉత్సవం అంఆసుపత్రిలోని రోగులకు త్వరగా ఆరోగ్యం కుదరాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.గరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని, తెలుగు సంస్కృతిలో భాగమైనటువంటి బోనాల పండుగకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందానికి, సిబ్బందికి ఆయన బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్.ఎం.ఓ డా.దామోదర్, ఆర్.ఎం.ఓలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలి

**- "అపార్" నమోదు వేగవంతం చేయాలి**

**- 95 శాతం విద్యార్థుల హాజరు ఉండాలి**

**- మౌలిక సదుపాయాలు సమీక్షించాలి**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, ఆగస్టు 06 విజన్ ఆంధ్ర : సెర్ప్, విద్యా శాఖ ఉన్నతాధికారులతో డిఆర్డిఏ, మెప్మా, జిల్లా విద్యా శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారువిద్యాశాఖకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్డిఏ, మెప్మా, విద్యా శాఖ సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలని, పంపిణీకి ముందు యూనిఫామ్ నాణ్యతను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలియజేసే "అపార్" నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్ లో పొరపాట్ల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ సరి చేయించాలని, ప్రధానోపాధ్యాయులు ఈ బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, 95 శాతం విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈఓలు పరిశీలించాలని, అవసరమైన చోట వసతులు కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వర్షాల కారణంగా పాఠశాలలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం కావాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో నిర్దేశిత లక్ష్యం నిండే వరకు విద్యార్థులను చేర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, ఏ.డి ప్రశాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎమ్.ఈ.ఓలు పాల్గొన్నారు.

# పాలనలో ఆవిష్కరణలతో నాణ్యత పెంచాలి

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**




ఆదిలాబాద్, ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): దైనందిన విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను అన్వేషిస్తూ, సృజనాత్మక ఆలోచనలతో పాలనలో నాణ్యతను పెంచాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక సామర్థ్య పెంపు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా అధికారులు సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించే సేవలను వేగంగా, పారదర్శకంగా మార్చడానికి నూతన ఆలోచనలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి శాఖలోనూ సమస్యల పరిష్కారానికి వినూత్న మార్గాలను అన్వేషిస్తే సమాజంలో సానుకూల మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో టిజిఐసి ప్రతినిధులు వేర్వేరు రంగాల్లో సాధించిన నూతన ఆవిష్కరణలు, పనితీరు విధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రవి, డిఆర్‌డిఓ రవీందర్, డిపిఓ రమేష్, టీ–హబ్, అగ్‌హబ్, టీ–వర్క్స్ ప్రతినిధులు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహనీయులను ఘనంగా కొనియాడిన ప్రజాసంఘాల నాయకులు




అయిజ ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో మహనీయులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతి కార్యక్రమాన్ని అయిజ మండల ప్రజా సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన మహనీయుల విగ్రహానికి, అలాగే చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్, ప్రజా యుద్ధనౌక గద్దర్ గురించి వక్తలు మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ తొలి దేశ పోరాటం నుంచి మెడ దేశ పోరాటం వరకు ఆయన చేసిన పోరాటాల గురించి, ఆయన ఆలోచన విధానాన్ని ఆశయాలను మన వారసత్వానికి పంచాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రజా యుద్ధం నౌక గద్దర్ ఆటపాటలను తెలంగాణ పోరాటంలో ఆయన పాత్రను యువకులు ఆదర్శంగా తీసుకొని నేటి సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలు అక్రమాలను ఎదిరించాల్సిన అవసరం ఉందని, తమ సమాజం కొరకు పాటుపడాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్,ఎంఈఓ రాములు, నాగరదొడ్డి వెంకట రాములు, విజయభాస్కర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మధు కుమార్, అంజి బాబు, మిట్టదొడ్డి నరసింహులు, ఉప్పల దేవన్న, మొరుగు వీరేశ్, అశ్వ మారెప్ప, అశ్వ పెద్దయ్య, బహుజన రాజ్యసమితి నాయకులు,వినోద్ ఉత్తనూర్ వెంకయన్న ( రైతు కూలీ సంఘం.) పిడిఎస్ యు ( విజృంభణ) వెంకటేష్, మండలంలోని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు , కుల సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

**ఇందిరానగర్‌లో సీపీఐ పాదయాత్ర**



బోడుప్పల్, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర): కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు ప్రజా సమస్యలపై పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.చేపట్టిన పాదయాత్రలో భాగంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సెప్టెంబరు 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదలను అరికట్టాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని, విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలని రచ్చ కిషన్ డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ప్రజలు ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సీహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే. ప్రమీల, బీకేఎంయూ మండల కార్యదర్శి కే. మహాలక్ష్మి, అధ్యక్షుడు భూతం ఐలయ్య, సీపీఐ నాయకులు ఇస్తారి, సరిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక నూతన ఎంపీడీవో లలిత కుమారిని సన్మానించిన దుబ్బాక మండలం ఉప సర్పంచ్ లా ఫోరం

దుబ్బాక విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన అధికారిని లలిత కుమారి ని మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పాతూరి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల నూతన ఎంపీడీఓను మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పాతూరి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపసర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉపసర్పంచుల ఫోరం సభ్యులు, మండల అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

# మహిళలు, చిన్నారుల భద్రత అందరి బాధ్యత

**- మానవ అక్రమ రవాణాపై సమాజమంతా అప్రమత్తం కావాలి**
**- బాధితులు వెంటనే హెల్ప్‌లైన్‌లను ఆశ్రయించాలి**
**- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : మహిళలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ సీఈవో యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వల్ల మహిళలు, బాలికలు, చిన్నారులు ఎదుర్కొనే ప్రమాదాలు, రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, విద్య పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేయడం, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని వల వేయడం, నకిలీ వివాహాలు, చిన్నారులను ప్రలోభపెట్టడం లేదా అపహరించడం వంటి మార్గాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందని వివరించారు. ఇలాంటి ముఠాల బారిన పడితే వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోవడం, శారీరకమానసిక హింసకు గురికావడం, చదువు, భవిష్యత్తు దెబ్బతినడం, కుటుంబాలకు దూరమవడం వంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మోసపు ఉచ్చులో చిక్కుకున్న బాధితులు అత్యవసర సహాయం కోసం 112 (పోలీసు అత్యవసర సేవలు), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (బాలల హెల్ప్‌లైన్) నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ అంజాద్, జీసీడీఓ, ఏఎస్ఓ, సీడీపీఓలు, ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, డీహెచ్‌ఈడబ్ల్యూ స్టాఫ్, సఖి టీమ్, షీ టీమ్, భరోసా టీమ్, ఐసీపీఎస్ టీమ్, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐ.టి.ఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- ఐటీఐ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఖలీం**

గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని పదవ తరగతి పాసైన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ఐ.టి.ఐ, ఏటిసి(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ) నందు 2026–2027, 2026–2028 విద్యా సంవత్సరానికి ఎన్ సివిటి.పాట్రన్ క్రింద ఇంజనీరింగ్ కోర్సులలో రెండవ విడత అడ్మిషన్ కొరకు క్రింద తెలిపిన ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల కొరకు ఈనెల 06వ తేదీ నుండి 15 వరకు అవకాశం కలదని ఐటీఐ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఖలీం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈనెల 15 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఐ.టి.ఐ గద్వాల లో అందుబాటులో ఉన్న ట్రేడ్స్ వివరాలు 1. ఎలక్ట్రీషియన్ – 02, సంవత్సరాలు.ఫిట్టర్ – 02, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ – 02,మెకానిక్ డీజిల్ – 01 సంవత్సరం కోర్సులు ఉన్నాయని అలాగే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఎ. టి. సి .) గద్వాల లో అందుబాటులో ఉన్న సి ఎన్ సీ మెషిన్ టెక్నీషియన్–02 సంవత్సరాల కోర్స్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ –02, వేర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ (ఫీనిట్ హెల్మెంట్ మెథడ్) – 02, ఇంజనీర్ డిజైన్ టెక్నీషియన్–01, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ – 01, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ –01 సంవత్సరం కోర్సులు గెలవని ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు ముందుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి15వ తేదీ వరకు హ్ట్జాం://ఇట్.వశ్రీఖఅస్త్రుఖ.స్త్రశీజ.అఅ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని అయన ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 01.05.2026 నాటికీ 14–సంవత్సరాలు నిండిన 10వ తరగతి/8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు ఈ అవకాశం కలదని, అయితే 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కొన్ని కోర్సులకు మాత్రమే అర్హులని వాటి వివరాలను వెబ్ సైట్ లో పొందపరచినట్లు తెలియజేశారు. – అడ్మిషన్ ప్రయోజనాల కోసం విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా ప్రత్యేకమైన మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి మరియు ఆధార్ కార్డు కలిగి ఉండాలి. నమోదిత మొబైల్ నెంబర్, ఈమెయిల్ చిరునామా కోర్సు వ్యవధిలో ఏవిధంగాను సవరణలకు అనుమతించబడవు. ట్రైనీ వెరిఫికేషన్ కొరకు ట్రైనీలు రిజిస్టర్ మొబైల్ నెంబర్ను మాత్రమే ఉపయోగించాలి వేరొక మొబైల్ నెంబర్ ని ఉపయోగించడం వల్ల ఐటిఐ విద్యార్థి అడ్మిషన్ తిరస్కరణకు దారితీస్తుంది. ఈ కేవైసీ కోసం ఇతరుల ఆధార్ నంబర్లను ఉపయోగించకూడదని, మరిన్ని వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : – 9640407866 & 8341441763.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు06(విజన్ ఆంధ్ర); ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం వరంగల్ సి.కె.ఎం. ఆసుపత్రిలో నిర్వహించిన తల్లిపాల అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి గంటలోపే వచ్చే ముర్రుపాలను (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు అవసరమైన పోషకాలను సమృద్ధిగా అందిస్తాయని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో డయేరియా, న్యుమోనియా, కామెర్లు (జాండిస్) వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గడంతో పాటు మెదడు ఎదుగుదల మెరుగుపడుతుందని, తల్లిబిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతర రక్తస్రావం తగ్గడం, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవడం, స్థూలకాయం తగ్గడం, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, టైప్2 మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు తల్లులకు కలుగుతాయని వివరించారు. శిశువుకు తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన పరిపూరక ఆహారాన్ని అందించాలని సూచించారు. బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగడం ద్వారా తల్లిపాల ఉత్పత్తి మెరుగుపడుతుందని తెలిపారు. అవసరానికి మించి తల్లిపాలు ఉత్పత్తి అయ్యే తల్లులు మిల్క్ బ్యాంక్‌కు పాలను దానం చేయాలని, ఆ పాలను అవసరమైన శిశువులకు అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. అలాగే తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు కంగారూ మదర్ కేర్ (ఖుఅస్త్రుతీశీ వీశ్రీష్ట్రవతీ ఝుతీవ) విధానాన్ని పాటించడం ద్వారా వెచ్చదనం, రక్షణ, మెరుగైన ఎదుగుదల లభిస్తుందని వివరించారు. గర్భధారణ సమయంలోనే సాధారణ ప్రసవానికి మానసికంగా, శారీరకంగా సిద్ధం కావాలని, సాధారణ ప్రసవం ప్రతి తల్లికి జీవితంలో ఒక అద్భుతమైన అనుభూతి అని, వైద్య అవసరం లేనప్పుడు శస్త్రచికిత్స ప్రసవాలను ప్రోత్సహించకూడదని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యత, కంగారూ మదర్ కేర్ విధానంపై రోల్ ప్లే ప్రదర్శించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గారు బాలేంతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, సి.కె.ఎం. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లక్ష్మీదేవి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి రాజమణి, ప్రోగ్రామ్ అధికారులు డా. ఐ. ప్రకాష్, డా. రాజమౌళి, డా. సజిదా, డా. ఇక్తాదార్ అహమ్మద్, డా. అరుణ్ జోషి, ఆర్ఎంఓ డా. సృజన్ బాబు, యు.ఎఫ్.డబ్ల్యూ.సి. వైద్య అధికారి డా. దిలీప్ కుమార్, లెక్చరర్ ఇన్ కమ్యూనికేషన్ (డెమో) అబ్దుల్లా బాబా, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం

**- మహిళల భద్రత, డయల్-112, టీ సేఫ్ యాప్ వినియోగంపై విద్యార్థినులకు సూచనలు**




కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : చుంచుపల్లిలోని నర్సింగ్ కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణ, అత్యవసర సేవల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డయల్–112 అత్యవసర సేవలు, టీ సేఫ్ యాప్, మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.షీ టీమ్ ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చెడు సావాసాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలని విద్యార్థినులకు సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ, మహిళలు, చిన్నారుల రక్షణ సేవల కోసం పాత 100 నంబర్‌కు బదులుగా 112కు డయల్ చేయాలని సూచించారు. డయల్–112 ద్వారా అన్ని అత్యవసర సేవలను ఒకే నంబర్‌లో వేగంగా పొందవచ్చని వివరించారు.అలాగే టీ సేఫ్ యాప్ ద్వారా ప్రయాణ సమయంలో మహిళలు తమ భద్రతను మరింత మెరుగుపరుచుకోవచ్చని, యాప్‌ను వినియోగించే వారి ప్రయాణాన్ని పోలీసులు పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటారని తెలిపారు.మహిళలు, విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712682131ను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రవి, షీ టీమ్ ఎస్ఐ రమాదేవి, ఏహెచ్‌టీయూ ఎస్ఐ లక్ష్మణ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి జయశంకర్ కు నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 06(విజన్ ఆంధ్ర); తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిగా ఆయనను కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి మరియు కలెక్టరేట్ అధికారుకు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కి ఘనంగా నివాళులర్పించారు.

## అన్నారం షరీఫ్‌లో రెండు వైన్స్ షాపుల్లో చోరీ.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు





వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు06(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున రెండు వైన్స్ షాపుల్లో చోరీ జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామంలోని వెంకటేశ్వర వైన్స్ మరియు దుర్గ శ్రీ వైన్స్ దుకాణాలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు ముందుగా సీసీ కెమెరాలకు అనుసంధానంగా ఉన్న కరెంట్ వైర్లను తొలగించి, అనంతరం షాపు వెనుక భాగంలోని డోర్ గ్రిల్స్‌ను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. చోరీకి గురైన నగదు, మద్యం సీసాలు లేదా ఇతర ఆస్తుల విలువపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరిస్తున్నారు. సీసీటీవీ వ్యవస్థను ధ్వంసం చేయడంతో పాటు దుండగులు అనుసరించిన విధానంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. చోరీ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, నష్టం అంచనా మరియు దుండగుల ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అంతర్జాతీయ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సైదులుకు నివాళి..

**- కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు06(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సైదులు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. మృతుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో వర్ధన్నపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు కత్తుల శ్రీనివాస్ యాదవ్ మరియు దొరికిన మహేష్ గౌడ్ తమ వంతు బాధ్యతగా 50 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం సైదులు భార్య వినోద, కుమారుడు, ప్రజాదర్బార్ విలేకరి గడ్డం కరుణాకర్ బియ్యాన్ని స్వీకరించి సహాయం అందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 06,( విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను గురువారం రోజున సాధారణ తనిఖీలు భాగంగా కలెక్టర్ కె. హరిత సందర్శించారు . ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, అగ్నిమాపక పరికరాలు, ద్వంద్వ తాళాల వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గోదాంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రవేశనిష్క్రమణ వివరాలను కూడా పరిశీలించారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ప్రతి మండలంలో ఉల్లాస్ మరియు టాస్‌పై అవగాహన సదస్సును నిర్వహించాలి

**- ప్రతి మహిళ చదువుకోవాలి - జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 6, ( విజన్ ఆంధ్ర ) : నేడు ప్రతి మండలంలో ఉల్లాస్ మరియు టాస్ పై అవగాహన సదస్సును నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి అన్నారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎంఈఓ లు శుక్రవారం నాడు ఉదయం 10:30 గంటల నుండి 12:30 గంటల వరకు ప్రతి మండల రిసోర్స్ సెంటర్ నందు ఉల్లాస్ మరియు టాస్ పై అవగాహనా సదస్సును నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ ఇ ఆర్ పి, ఎ పి ఎం లు మరియు జిహెచ్ఎంసి, టీఎంసీ లు హాజరై ప్రతి స్వయం సహాయక సంఘం నుండి ఒక మహిళను ఉల్లాస్ తరగతులకు సమీకరించాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉల్లాస్ అక్షరాస్యత అభ్యసన కేంద్రాలనులి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆమె కోరారు. అంగన్వాడీ టీచర్లు తమ లబ్ధిదారులను ఉల్లాస్ తరగతులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. అన్ని ఎం ఈ ఓ లు గ్రామీణ మరియు పట్టణ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుపాఠశాల అనంతరం సాయంత్రం 3:30 గంటల నుండి 4:00 గంటల వరకులి రోజూ ఉల్లాస్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. దీని ద్వారా జిల్లా అక్షరాస్యత పెంచేల చూడాలని కోరారు. క్రమం తప్పకుండా చదువుకోలేని ఆర్ పి లందరు టి ఓ ఎస్ ఎస్ 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో మహిళా సమాఖ్యలో ఉల్లాస్ పుస్తకాలు మరియు టి ఎల్ ఎం అందుబాటులో ఉన్నవాటిని క్షేత్రస్థాయి వరకు అందించాలని అన్నారు. ప్రతి ఒక్క నిరక్షరాస్యురాలైన మహిళ చేతిలో ఉల్లాస్ పుస్తకం ఉండాలని, వారు లిఉల్లాస్ తరగతులకు హాజరయ్యేలా చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆమె తెలియజేశారు. ప్రతి మహిళ చదువుకోవాలని, ఆమె ఎవరిపైనా ఆధారపడకూడదని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కోసం చదువుకోవడం ప్రతి మహిళకు ఉందిని ఆమె తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



గోపాలపేట ఆగస్ట్ 06( విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని ప్రతి గర్భిణికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత (అనీమియా) సమస్య ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం గోపాలపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. లేబర్ రూమ్‌లో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేసి, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఈడీడీ (జుణణ) రిజిస్టర్‌ను పరిశీలించి, రాబోయే తొమ్మిది నెలల్లో ప్రసవించనున్న గర్భిణుల వివరాలు, వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ప్రసవాల వివరాలు, రక్తహీనత సమస్యతో బాధపడుతున్న గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను వెంటనే గుర్తించి వారికి పోషకాహారం, అవసరమైన మందులు అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎంసీహెచ్ (వీజ౨) పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేబర్ రూమ్‌లకు(డెలివరీ రూమ్) అవసరమైన మౌలిక వసతులు, పరికరాలు లేదా ఇతర అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు

# సోమశిల లో అర్ధరాత్రి టూరిజం శాఖ సిబ్బందిపై దాడి

- **దాడి చేసిన టూరిస్టులను అదుపులోకి తీసుకున్న కొల్లాపూర్ పోలీసులు**
- **గాయపడిన సిబ్బందిని మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు!**
- **బోట్ ప్రయాణానికి అనుమతి లేకపోవడంతో టూరిస్టులు ఆగ్రహంతో చేసిన దాడి**
- **సోమశిల లో అక్కడక్కడ పనిచేయని సీసీ కెమెరాలు?**
- **కాటేజీలలో అనుమానాస్పద కార్యకలాపాలు?**
- **గ్రామంలో మినీ పోలీస్ స్టేషన్ తో పాటు టోల్‌గేట్ ను నిర్మించండి, గ్రామ సర్పంచ్!**
- **దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ,కొల్లాపూర్ పోలీసులు**









కొల్లాపూర్ ఆగస్టు 6 : (విజన్ ఆంధ్ర) నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల టూరిజం బోటింగ్ పాయింట్ వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో టీఎస్ 07 హెచ్ జెడ్ 5777 అనే కార్లో షాద్నగర్ నుంచి వచ్చిన ముగ్గురు యువతులు ఇద్దరు యువకులు మొత్తం ఐదుగురు టూరిస్టులు మద్యం మత్తులో టూరిజం శాఖ ఇద్దరు సిబ్బందిపై కర్రలతో పాటు, రాళ్లతో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. దాడిలో గాయపడిన సెక్యూరిటీ గార్డు శివకుమార్, బోటు డ్రైవర్ దేవరాజులను మొదట కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రికి, చికిత్స కోసం గ్రామస్తులు తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోటు ప్రయాణానికి అనుమతి లేకపోవడంతో ఆగ్రహించిన టూరిస్టులు ఈ దాడికి పాల్పడినట్లు కొల్లాపూర్ ఎస్సై ఆనంద్ తెలిపారు. దాడి చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే సోమశిలలో పనిచేయని సీసీ కెమెరాలు, కాటేజీలలో అనుమానాస్పద కార్యకలాపాలు వంటి అంశాలుపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోకి వచ్చేవారు, వెళ్లేవారిని గుర్తించలేకపోతున్నామని, తక్షణమే మినీ పోలీస్ స్టేషన్, టోల్–గేట్ నిర్మించాలని, పనిచేయని సీసీ కెమెరాలను సరిచేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు.

# కేర్ వాస్క్యులర్ క్యాంప్‌లో 300 మందికి పరీక్షలు



హైదరాబాద్, ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర) : జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్ నిర్వహించిన ఉచిత వాస్క్యులర్ హెల్త్ క్యాంప్‌లో 300 మందికి పరీక్షలు నిర్వహించినట్లు హాస్పిటల్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ పి.సి.గుప్తా(క్లినికల్ డైరెక్టర్, హెచ్ఓడీవాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జరీ) ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 70 మందిలో వెరికోస్ వెయిన్స్, 50 మందిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ అనుమానిత లక్షణాలు, 20 మందిలో డయాబెటిక్ ఫుట్ సమస్యలు గుర్తించినట్లు చెప్పారు. 20 మందికి అధునాతన పరీక్షలు, ఐదుగురికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపారు. వాస్క్యులర్ వ్యాధులపై అవగాహన, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను డాక్టర్ పి.సి.గుప్తా వివరించారని తెలిపారు.

# చిన్నపాటి వర్షాలు చూసి వరి వేసి మోసపోవద్దు!

- **ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి**
- **వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం**
- **ఈ సీజన్‌లో 30 వేల ఎకరాల్లో వేరుశెనగ సాగు లక్ష్యం**
- **రైతులకు ఏఐ వాయిస్ అసిస్టెంట్ కాల్స్ ద్వారా శాస్త్రీయ సలహాలు**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి వర్షాలను చూసి రైతులు వరి పంట వేసి మోసపోకుండా, వారికి ఎల్‌నినో పరిస్థితులు, రానున్న వర్షాభావ ముప్పుపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ప్రాజెక్టు నిండినా వరి సాగు సబబు కాదు**

సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నిండినప్పటికీ దాన్ని మాత్రమే నమ్ముకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సరికాదన్నారు. ప్రాజెక్టు నిండడం వల్ల కేవలం 10 శాతం ఆయకట్టుకు మాత్రమే సాగునీటి లభ్యత ఉంటుందని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపైనే దృష్టి**

వరికి బదులుగా తక్కువ నీటితో పండే వేరుశెనగ, ఆయిల్ పామ్, ఉల్లి, కూరగాయలు, కంది, మినుములు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ సీజన్‌లో జిల్లాలో 30 వేల ఎకరాల్లో వేరుశెనగ సాగును లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధికారులు తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటల జాబితాను సిద్ధం చేసి, ఏఐ (AI) వాయిస్ అసిస్టెంట్ ద్వారా రైతుల ఫోన్లకు నేరుగా అవగాహన కాల్స్ పంపించనున్నట్లు వెల్లడించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు మండల వ్యవసాయ అధికారులు (హీూూ), వ్యవసాయ విస్తరణ అధికారులు (AEO) పంటల మార్పిడిని తమ ప్రధాన బాధ్యతగా స్వీకరించాలని, ప్రతిరోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. పంటల మార్పిడి అంశంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తానని, నిర్దేశిత లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన శాస్త్రీయ సలహాలు అందించి, సమర్థవంతంగా పంటల మార్పిడి జరిపేలా వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ వేగవంతంగా పూర్తి చేయాలి

- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**
- **అప్పాయిపల్లిలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పరిశీలన**



అచ్చంపేట ఆగస్టు 6 (విజన్ఆంధ్ర): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. గ్రామంలోని 254, 256, 258 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల వివరాల నమోదు, ధ్రువీకరణ, డిజిటలైజేషన్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో మాట్లాడిన కలెక్టర్, గ్రామంలో మొత్తం 2,440 మంది ఓటర్లలో దాదాపు 2,000 మంది ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని తెలుసుకున్నారు. మిగిలిన ఓటర్లలో కొందరు ఇంటికి తాళం వేసి ఉండడం (డోర్ లాక్), మరికొందరికి ద్వంద్వ ఓటర్లు (డబుల్ ఓట్లు)గా నమోదు ఉండడం, ఇంకొందరు మరణించిన వారి పేర్లు జాబితాలో ఉండడం వంటి కారణాలతో ప్రక్రియ పూర్తికాలేదని బీఎల్‌వోలు కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా గ్రామంలోని కొంతమంది ఓటర్లకు ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాలు అందలేదని గ్రామ సర్పంచ్‌తో పాటు బీఎల్‌వోలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఒక్క అర్హుడైన ఓటరు కూడా ప్రక్రియకు దూరం కాకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ పత్రాలు అందేలా చూడడంతో పాటు, డోర్ లాక్ కేసులను మరోసారి పరిశీలించాలని, రెండు చోట్ల ఓటర్లు, మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం ధ్రువీకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు గ్రామ సర్పంచ్ విజయ్ కృష్ణ తదితరులు ఉన్నారు

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి


- **జనసేన విద్యార్థి పోరు దీక్షలో రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ డిమాండ్**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శ**
- **విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేసి ఒత్తిడి తేవడం సరికాదని హెచ్చరిక**
- **జీఓ నెం.09ను పకడ్బందీగా అమలు చేయాలని జనసేన డిమాండ్**
- **ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌కు నివాళులర్పించి దీక్ష ప్రారంభం**
- **విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం**
- **వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ప్రజా సంఘాల నేతల సంఘీభావం**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. జనసేన విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు మిరియాల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన లిలి"జనసేన విద్యార్థి పోరు దీక్ష"లిలిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బకాయిల పేరుతో విద్యాసంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేసి ఒత్తిడి తేవడం అన్యాయమని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. దీక్షకు ముందు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ దీక్షను ప్రారంభించారు. జనసేన ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించలేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. జనసేన విద్యార్థి విభాగం నాయకుడు మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి విద్యార్థుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. జీఓ నెం.09ను కచ్చితంగా అమలు చేసి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఓయూ జేఏసీ నాయకుడు సంపత్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం జనసేనతో కలిసి పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ దీక్షకు ఉస్మానియా, కాకతీయ, పాలమూరు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు, పలు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా హాజరై సంఘీభావం తెలిపారు. సాంస్కృతిక బృందం ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, దామోదర్ రెడ్డి, నందగిరి సతీష్, మేకల సతీష్ రెడ్డితో పాటు విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, తెలంగాణలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనపర్తి ఐటీఐ హబ్ అభివృద్ధి రూ. 241 కోట్లు

- **'విద్యాపర్తి' కీర్తి కిరీటంలో మరో కలికితురాయి**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : వనపర్తిని విద్యా, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు స్థానిక శాసనసభ్యులు శ్రీ తూడి మేఘారెడ్డి చేపట్టిన ప్రత్యేక కృషి ఫలించింది. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం విధానంలో చేపట్టిన 'క్లస్టర్8 అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్' ప్రాజెక్టు కింద రూ. 241 కోట్ల అంచనా వ్యయంతో వనపర్తి ప్రభుత్వ ఐటీఐని ప్రధాన హబ్‌గా ఎంపిక చేస్తూ టెండర్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వనపర్తి ఐటీఐ ప్రధాన హబ్‌గా వ్యవహరించనుంది. దీనికి మన్ననూరు, మహబూబ్‌నగర్ (బాలికల), దిండి, గద్వాల ప్రభుత్వ ఐటీఐలు అనుసంధానమై పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ వంటి నూతన కోర్సులు అందుబాటులోకి వస్తాయి. అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, ఆధునిక యంత్ర పరికరాల ఏర్పాటు. ఎంపికైన పరిశ్రమ భాగస్వామి ఐదేళ్లపాటు క్లస్టర్‌ను నిర్వహిస్తూ శిక్షణా నాణ్యతను పెంచి, అప్రెంటిస్‌షిప్‌లు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పిస్తారు. గ్రామీణ యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా, స్థానికంగానే అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు సాధించి ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మంజూరుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నందినగర్‌లో కీలక భేటీ

- **కేటీఆర్‌ను కలిసిన ప్రకాష్ అంబేద్కర్..**
- **సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ నందినగర్‌లోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీలో సమకాలీన రాజకీయ పరిణామాలు, సామాజిక అంశాలు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై పరస్పరం చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంతో పాటు సామాజిక వర్గాల ప్రముఖుల మధ్య కొనసాగుతున్న సమన్వయానికి నిదర్శనంగా నిలిచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# జిల్లా స్థాయి యోగ పోటీల్లో నాగభూషణ విద్యాలయం విద్యార్థుల సత్తా

**- ఆరుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ రాష్ట్ర స్థాయికి ఎంపిక**




బాసర, ఆగస్టు06:విజన్ ఆంధ్ర : నిర్మల్ జిల్లా :యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్లూరులోని సాయిబాబా టెంపుల్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో బాసరలోని నాగభూషణ విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఎం. చంద్ర తేజ్ (9వ), సీహెచ్. అవంతి (10వ), దీపక్ (7వ), జి. మనీష్, డి. అవినాష్, బి. సాయి గోల్డ్ మెడల్స్ సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగ కోచ్ మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ సులోచన, పిఈటి ఉపాధ్యాయుడు నవీన్‌తో పాటు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించి సన్మానించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఇదే స్థాయి ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు.

# జిల్లాలో ఇప్పటివరకు 41.40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 6, (విజన్ ఆంధ్ర) : రంగారెడ్డి జిల్లా పరిధిలోని 27 మండలాల్లో ఈ ఆగస్టు మాసంలో ఇప్పటివరకు 41.40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఒక ప్రకటనలో వివరించారు. గత సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ సంవత్సరము వర్షపాతం తక్కువగా నమోదైనట్లు గతంలో ఎన్నడు లేని విధంగా అత్యంత తక్కువ వర్షపాతం రంగారెడ్డి జిల్లాలో నమోదు అయినట్లు ఆయన తెలిపారు. గత నెలలో 143.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు, గత సంవత్సరము జూలై మాసంలో 221.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా గత నెల వరకు 143.60 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోల్చి చూస్తే ఇప్పటివరకు 78.2 0 మిల్లీ మీటర్ల తక్కువ వర్షపాతం నమోదైనట్లు వారు వివరించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొందూరుగు లో 105.5 0 మిల్లి మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదు కాగా మంచెల్లో ఐదు పాయింటు రెండు సున్నా మిల్లీమీటర్ల అచల్ప వర్షపాతం నమోదు అయినట్లు వారు పత్రిక ప్రకటనలు పేర్కొన్నారు. గత వార్షిక సంవత్సరము 2025 26 లో 750.5 0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈ సంవత్సరము ఇప్పటివరకు 326.2 0 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు సీఈవో వివరించారు. 2022 23వ సంవత్సరంలో 694.5 0 మిల్లీమీటర్ల వర్షపాతం గాను అత్యధికంగా 1120.30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు ప్రకటించడం జరిగింది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని 27 మండలాలలో ఇప్పటివరకు 15 మండలాల్లో ఈరోజు వరకు వర్షపాతం నమోదు కాకపోవటం విచారకరమని వారు ఈ సందర్భంగా పత్రిక ప్రకటనలో వివరించడం జరిగింది. అదేవిధంగా 12 మండలాల్లో అతి తక్కువగా వర్షపాతం నమోదైనట్లు అయినా గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొనటం జరిగింది.

# వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**- సత్వర న్యాయమే లక్ష్యం - జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆమె వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదుల నమోదు, పరిష్కార విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి మర్యాదపూర్వకంగా స్పందించి, ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని రిసెప్షన్ సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, స్వాధీన వాహనాల నిర్వహణ, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, సమస్యాత్మక వ్యక్తుల రికార్డులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పరిశీలించారు. ఆధునిక పోలీసింగ్ విధానాలను అనుసరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా స్వాగతించి, ఓర్పుతో విని సత్వరమే స్పందించాలి ఆకతాయిలు, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, చోరీలపై రాజీలేని చర్యలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులపై సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు ప్రజల సహకారంతోనే నేరహిత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధరత్నం, వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు రెడీ కావాలి.

**- 12వ తేదీలోపు పనులు పూర్తి చేయండి**

**- కలెక్టర్ బోర్కడే హేమంత్ వాసుదేవరావు.**



ములుగు, ఆగస్టు 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, ఆగస్టు 12వ తేదీలోపు పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, పైలాన్ నిర్మాణం, హెలిప్యాడ్ల మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని దర్శించుకునే నేపథ్యంలో పూజా కార్యక్రమాలు, శేష వస్త్రాల సమర్పణ, ఆలయ పరిసరాల పరిశుభ్రతను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన కలెక్టరేట్ లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ సౌకర్యాలు ఉండాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వీఐపీల బస కోసం అతిథి గృహాలు సిద్ధం చేయాలని, వైద్య, అగ్నిమాపక శాఖలు అన్ని అత్యవసర సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, సంపత్ రావు, ఆర్.డి.ఓ కృష్ణవేణి, డి.ఆర్.ఓ రవికుమార్, డి.ఎస్.పి రవీందర్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన మున్సిపల్ ప్రజాప్రతినిధులు



ములుగు ఆగస్టు 6, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ములుగు సెక్టార్‌లోని వీవర్స్ కాలనీ అంగన్వాడి కేంద్రం పరిధిలో అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, 7వ వార్డు కౌన్సిలర్ బైకాని సునీత, 19వ వార్డు కౌన్సిలర్ ఓం ప్రకాష్ లు పాల్గొని చిన్నపిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి వారు మాట్లాడుతూ శిశువులు పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం, మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, శిశువుల ఆరోగ్యం ,పోషణలో తల్లిపాల పాత్రను వివరించారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు.

***ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలి - కలెక్టర్ బోర్ఖడే హేమంత్ వాసుదేవరావు.***

ములుగు ఆగస్ట్ 06 , విజన్ ఆంధ్ర ప్రతినిధి: గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం ఉన్న మేధావి అని కొనియాడారు. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని, రాష్ట్ర అభివృద్ధికి మంచి ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం అధికారులు, ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఆచార్య జయశంకర్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, సంపత్ రావు, డి.ఆర్.ఓ రవికుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, డి.పి.ఆర్.ఓ రఫీక్, కలెక్టరేట్ ఏ.ఓ రాజ్ కుమార్, సూపరిండెంట్లు మహేష్ బాబు, మంజుల, శివకుమార్ తో పాటు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీనగర్ లో రూ 5.30 లక్షలతో విద్యుత్ పనులు ప్రారంభించిన సర్పంచ్.



ములుగు ఆగస్ట్ 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గాంధీనగర్ గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలను పునరుద్ధరించేందుకు 5 లక్షల 30 వేల రూపాయలతో చేపట్టిన మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని పాత విద్యుత్ లైన్లు శిథిలావస్థలో ఉండటంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో రైతులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంత్రి సీతక్క సహకారంతో ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. పనుల్లో భాగంగా దెబ్బతిన్న వైర్లను మార్చడం, కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు మాలోతు శంకర్, తేజావత్ హుని, రామావత్ సంధ్య, బిక్షపతి, కూరాకుల సురేష్, బాలవికాస ప్రతినిధులు వినయ్, శంకర్ తో పాటు గ్రామ పెద్దలు, వివిధ కమిటీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# ములుగులో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం.

**సీఎం పర్యటనను విజయవంతం చేయాలి - జిల్లా యూత్ కాంగ్రెస్.**



ములుగు ఆగస్ట్ 06 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆలోచనలతో ములుగు జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం గురువారం మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగింది జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, ములుగు నియోజకవర్గ అధ్యక్షులు సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ బాధ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌ను జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేయాలని, ప్రతి మండలంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. సాంఘిక మాధ్యమాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ నెలలో ములుగు జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా సమావేశంలో సమీక్షించారు. పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని నాయకులు కోరారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల అధ్యక్షులు, సాంఘిక మాధ్యమాల నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టేడియంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన

**- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి"**

**- యూనిఫాంల పంపిణీ, జయశంకర్-గద్దర్ లకు నివాళులు...**





ఉమ్మడి జిల్లా,కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), ఆగస్టు 06: కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి, విద్యా కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. కల్వకుర్తి పట్టణంలో స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**యువతకు క్రీడా వేదిక**

ముందుగా కల్వకుర్తి పట్టణంలో నూతనంగా నిర్మించబోయే స్టేడియం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం నిర్మాణంతో యువ క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. నియోజకవర్గంలో క్రీడారంగ అభివృద్ధికి ఇది కొత్త ఊపునిస్తుందని, జాతీయ స్థాయి క్రీడాకారులు ఇక్కడి నుంచి రావాలని ఆకాంక్షించారు.

**యూనిఫాంల పంపిణీ, నివాళులు**

అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో వారి సేవలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులతో కలిసి భోజనం**

కార్యక్రమం చివరలో పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులతో మాట్లాడి మెనూలో మార్పులు, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఒకే వరుసలో కూర్చొని భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు, యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాన్వాజ్, కౌన్సిలర్ ఎజాస్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలు ఆదర్శనీయం - జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు**

**- తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం**

**- నిబద్ధతతో పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన చూపిన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బలమైన సిద్ధాంతపరమైన పునాది వేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, సమాన అభివృద్ధి కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత, దూరదృష్టి నేటి తరానికి నిరంతర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునంద, వనపర్తి సీఐ సుగంధ రత్నం, సీసీఎస్ సీఐ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**

**- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : ఈ నెల 15న నిర్వహించే దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వనపర్తి జిల్లాలో ఘనంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ (IDOC) కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు, ఆహ్వానితులందరికీ సముచితంగా ఆహ్వాన పత్రాలు అందజేయాలి. హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలి. పోలీసు గౌరవ వందనంతో పాటు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలి. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పక్కాగా ఉండాలి. కార్యక్రమం జరిగే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. సాంస్కృతిక కార్యక్రమాలు & స్టాళ్లు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్ (స్థానిక సంస్థలు), వినోద్ కుమార్ (రెవెన్యూ), ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, సీపీఓ హరికృష్ణ, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**- తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ సేవలు చిరస్మరణీయం**

**- ఐడీఓసీలో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు**

**- చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : ప్రత్యేక తెలంగాణ సాధనలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ (కలెక్టరేట్) కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు ఖిమ్యా నాయక్ (స్థానిక సంస్థలు), వినోద్ కుమార్ (రెవెన్యూ) లతో కలిసి కలెక్టర్, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధం నాగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముకు కట్టుదిట్టమైన భద్రత

**- నెలవారీ తనిఖీలు చేపట్టిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- సీసీ కెమెరాల వ్యవస్థ, భద్రతా ఏర్పాట్ల పరిశీలన**





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించే నెలవారీ తనిఖీల్లో భాగంగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీఐ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు ఈవీఎం గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నట్లు వివరించారు. గోదాము ప్రాంగణంలో భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు రమేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు మరియు ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐద్వా ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతు తరగతులు ప్రారంభం



మల్కాజిగిరి, ఆగస్ట్ 6,(విజన్ ఆంధ్ర): మౌలాలి భరత్ నగర్ లో ఐద్వా ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభ మైనాయి. మహిళలు ముఖ్యమైన వారు అందరూ దాదాపు 40 మంది ఈ క్లాసులకు హాజరైనారు. తరగతికి ఉపాధ్యాయులుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నన్నపనేని సృజన మద్దెల వినోద వ్యవహరించారు. కార్యక్రమానికి ముందుగా మహిళ, మైనారిటీ, ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఉండాలని చెప్పినటువంటి గొప్ప నాయకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మైనారిటీ నాయకురాలు నూర్ భాను పూలమాల వేసి నివాళుల ర్పించారు. 33% రిజర్వేషన్ వెంటనే అమలు చేయా లని, బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధిస్తామని సభికులందరూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ గా చల్లాలీలావతి ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. పిట్టలమంగా మొత్తం సమీకరణ సంబంధించి చూసుకున్నారు. అన్నపూర్ణ, నూర్, భాను, నరసమ్మ మొదలగు వారు వ్యవహరించారు. అట్లాగే కార్యక్రమాలకు గొడుగు ప్రవీణ సహాయం చేశారు. రాజకీయ తరగతుల ముఖ్య ఉద్దేశం సృజన తెలిపారు. సమాజ పరిణామంలో స్త్రీ మొదటి నుండి కూడా ఏ విధంగా సమస్యలు ఎదుర్కొంటూ ఇప్పటివరకు ఎదిగిందో తెలిపారు. ఇప్పటికీ నవీన యుగంలో కూడా స్త్రీ ఇంకా సమస్యలు ఎదుర్కొంటూనే ఉందని, దీనికి పరిష్కారం చట్టసభలలో మహిళలు లేకపోవడం అన్నారు. ముఖ్యంగా మనం గమనించాల్సింది చట్ట సభల్లో వెంటనే మహిళల్ని చేర్చాలని, 33% రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అప్పుడే మహిళలకు ఒక విధంగా విముక్తి లభించే అవకాశం ఉందని తెలి పారు. అట్లాగే క్రీడల్లో కానీ, కిచెన్ లో గాని, ఉపన్యాసాల్లో కానీ, పొలం పనుల్లో కానీ, ఐఐటీ, ఐఏఎస్ లలో కానీ మహిళల ముందున్నా రన్నారు. పైలట్లుగా, కమాం డోస్ కూడా మహిళలు ముందుండి పోరాడుతు న్నారని సృజన తెలిపారు ఇంత దేశ సేవ చేస్తూ కూడా ఇప్పటికీ స్త్రీలు కొన్ని ప్రాంతాల్లో చాలా దుర్భర మైనటువంటి పరిస్థితిని అనుభవిస్తున్నారని, దీనికి కారణం పూర్తిగా ప్రభుత్వా లు వాటి స్వార్థం కోసం ప్రజల యొక్క అభివృద్ధిని కుంటుపరుస్తున్నారని తెలిపారు. దానివలన అభివృద్ధిలో సగభాగం అయినటువంటి స్త్రీ పాత్ర లేకపోవడం వల్లనే స్త్రీల యొక్క పరిస్థితి కుంటుప డుతుందని ఆమె అన్నారు. ఎన్ని ఉద్యోగాలలో స్త్రీలు ఉన్నప్పటికీ అక్కడ ఉద్యోగ భద్రత లేదని, పర్మినెంట్ ఉద్యోగాలు లేక ప్రైవేటు ఉద్యోగాలలో స్త్రీలు హింసింపబడుతున్నారని, వారిపై బాగా లైంగిక వేధింపు జరుగుతుం దన్నారు. మరో ప్రక్క ప్రభుత్వం లాభాల కోసం, కమిషన్ల కోసం మద్యం, గంజాయి, డ్రగ్స్ ను కొన్ని డైరెక్టుగా, కొన్ని ఇన్ డైరెక్ట్ గా అమ్మకాల వల్ల మహిళ లను పిల్లలను వేధించడమే కాకుండా, వాళ్లపై దాడులు జరుపుతున్నారని తెలిపా రు. అంతేగాకుండా పురుషులు కూడా కొన్ని సందర్భాల్లో విచక్షణ కోల్పోయి వాళ్ళని వాళ్లు చంపుకుంటున్న పరిస్థితి ఉందని, నిన్ననే ఒక వ్యక్తి చార్మినార్ లో మరో వ్యక్తిని కొబ్బరికాయల కత్తితో నరకడం టీవీల్లో చూసామని చెప్పారు. ఇదంతా కూడా కేవలం ప్రభుత్వం యొక్క చేతగానితనం దాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి మద్యంను పూర్తిగా అదుపు చేయాలని డ్రగ్స్ ను ఎక్కడికక్కడ నిరోధిం చాలని, దానికి మహిళలు మాత్రమే కాదు ఈ సమాజం మొత్తం కూడా ఇబ్బందుల పాలవుతుంద న్నారు. కనుక దీనికి పురుషుల యొక్క బాధ్యత కూడా ఉందని, ఇది మనందరం కలిసి ఎదిరించి మన సమాజాన్ని కాపాడు కోవాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. ప్రతి సమస్యను కూడా మహిళలు పరిష్కరించు కోవడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుందని ఆమె తెలిపారు. పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు తొందరగా తీసుకోవట్లేదని, ఏ టీములు కూడా మహిళా సమస్యలు పరిష్కరించ లేకపోతున్నాయని, దానిని పరిష్కరించుకోవడానికి ఒకటే మార్గం అందరం ఒకటిగా ఉండి మహిళా సంఘం( ఐద్వా) ద్వారా మన సమస్యలు పరిష్కరించుకోవాలని అందుకు అందరూ ఐద్వాల్లో ముందుండి పోరాడాలని, సంఘాన్ని సంఘటితం చేసుకోవాలని ఆమె తెలియజేశారు. అనంతరం వినోద మాట్లాడుతూ... ఆరు గారెంటీలు ఏది కూడా సరిగ్గా పని చేయడం లేదని రేవంత్ రెడ్డి చెప్పిన హామీలలో ఒక్క బస్సు మాత్రమే పని చేస్తుందని, అది కూడా బస్సులు పెంచకుండా పెంచినట్టే పెంచి తగ్గిస్తున్నారని, దాని వల్ల మహిళలే ఇబ్బందిపడి వాళ్ళని వాళ్లే కొట్టుకు నేటట్టు ఈ ప్రభుత్వం చేసిందని తెలిపారు. అదొక్కటే కాక ఆరోగ్యానికి కూడా అమలు చేయాలని ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదు. డబల్ బెడ్రూమ్ లు ఇవ్వలేదు. మరి అవన్నీ ఎవరి కోసం. ఏం చేస్తారు భూమి అంతా కూడా అమ్మేస్తున్నారు. హైదరాబాదు భూమిని అమ్మే అధికారం ఎవరికీ లేదు. హైదరాబాద్ భూమిని మనమంతా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం కూడా మనం పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు పేదల కోసం ఏర్పాటు చేసినటువంటి భూమిని వాళ్లు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను కూల్చి, కార్పొ రేటర్లకు అప్పజెప్తున్నారని ఆమె తెలిపారు. ఏ షరతు లు లేకుండా ఇండ్ల స్థలాలు ఇల్లు ఇవ్వాలని, లోన్ల రూపంలో ఇల్లు కట్టుకోవ దానికి డబ్బులు ప్రభుత్వమే సహాయం చేయాలని కోరారు. అంతే కాదు ఉద్యోగాలు చేసుకో వడానికి మహిళలకు అవకాశం ఇవ్వాలని, వాళ్ళ కుటుంబాలు గడవడానికి మహిళలకు ఉద్యోగాలు కల్పించాలని, అట్లాగే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, 6 గ్యారంటీలు పూర్తిగా అమలు చేయాలని కోరారు. దాని కోసం మనం పోరాడాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ లీడర్ కోమటి రవి మాట్లాడుతూ... మహిళల పోరాటాలతోనే ఏ సమాజ మైనా బాగుపడుతుంది. మార్పుకి నాంది పలుకు తుంది. అందుకు మహిళ లకు జేజేలు అన్నారు. ప్రతి పోరాటం కూడా ఒక మార్పుకు మైలురాయి అని, గుణాత్మకమైన మార్పుకు మహిళే మూలాధారం అవుతుందని తెలిపారు. దేశం మొత్తం కూడా ఉద్యోగాలు లేక ఉన్న ఉద్యోగాలు పోయి గ్యారెంటీ లేక జీతాలు రాక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, ఆ కుటుంబాలను కాపాడు కోవడానికి మహిళలు ఎంతో అవస్థ పడుతున్నా రని ఆయన తెలిపారు. కాబట్టి అందరూ కలిసి ఐక్య పోరాటాలు నిర్వహిస్తే నే మన జీవితాలు బాగుపడతాయని, అట్లాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో మన దేశ ప్రజలకు అందవలసిన సౌకర్యాలు అందరికీ అందేందుకు మనం కూడా కృషి చేయాలని సూచించారు. అందుకోసమే కుల మత భేదాలు లేక అందరం కలిసి మెలిసి ఉండాలని, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళల హక్కుల కోసం అందరం కలిసి పోరాటాలు నిర్వహించి సాధించుకోవా లని ఆయన పిలుపుని చ్చారు. పిట్టలమంగ వందన సమర్పణ చేశారు. మనందరం మన నాయకులు చెప్పినట్టుగా ప్రతి మాట కూడా మనసులో పెట్టుకుని గట్టిగా పోరాటాలు నిర్వహించి మన హక్కులు సాధించుకోవాలని తెలిపి సభను ముగించారు. ఈ కార్యక్రమంలో శారద, సుశీల, అన్నపూర్ణ, శివ కుమారి, అనురాధ, రాధ తో పాటుగా మొత్తం 40 మంది పాల్గొన్నారు

# దుబ్బపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి జిల్లా 06 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : ఐడిఓసి కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి పనులు, జెన్కో ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, విద్యుత్ పనులు, కన్వేయర్ బెల్ట్ నిర్మాణం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. విద్యుత్ పనుల అంచనాలకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు జెన్కో కు పంపించి సవరించిన అంచనాలను పొందాలని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ పరిహారం పంపిణీపై సమీక్షిస్తూ అర్హులైన నిర్వాసితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పరిహారం మంజూరై మరణించిన లబ్ధిదారుల విషయంలో చట్టబద్ధ వారసుల ధ్రువపత్రాల ఆధారంగా చెల్లింపులు చేయాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన పెండింగ్ వినతులను త్వరితగతిన పరిష్కరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి మిగిలిన భూముల సమస్యలు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.భూసేకరణ కేసుల్లో సాదాబైనామా అంశాలపై చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, అర్హత నిర్ధారణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కన్వేయర్ బెల్ట్, జెన్కోకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరగా పూర్తి చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్. కుమార్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి, గన్ పూర్ మండలాల తహసీల్దార్లు లక్ష్మి రాజయ్య, రాజేశ్వర రావు, ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీ లు

**- నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటే శ్వర్లు**



నారాయణపేట ,ఆగస్టు 6 ( విజన్ ఆంధ్ర) : జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా నారాయణపేట పట్టణంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ బృందంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నిఫర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయం తో బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, రెస్టారెంట్లు అనుమానా స్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.డ్రగ్స్, గంజా యి వంటి మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్ట మైన చర్యలు చేపడుతు న్నారని తెలిపారు. యువ త మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ సమాజా న్ని నాశనం చేసే ప్రమాదకర మైన వ్యసనమనిఅన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదాడయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చి న వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతా యని తెలిపారు.ఈ తనిఖీ ల్లో నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లలు, యువత డ్రగ్స్ మహమ్మారి భారీన పడకుండా చూడాలి

**- సామాజిక సేవలో బ్రహ్మకుమారీల పాత్ర ప్రశంసనీయం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : మనుషుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే ఎలాంటి వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నషా ముక్త భారత్, మిషన్ స్పందన ఆధ్వర్యంలో గురువారం గద్వాల పట్టణంలోని బ్రహ్మకుమారిస్ పీస్ పార్క్ వద్ద ఉన్న అమృత్ కుంజ్ భవనంలో 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పిల్లలు, యువత, ఎవరైనా సరే డ్రగ్స్ మహమ్మారి భారీన పడకుండా ఇప్పటికే పోలీసు శాఖ, సంక్షేమ, తదితర శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వారికి తమ వంతుగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. వివిధ వ్యసనాలకు గురైన వ్యక్తులు భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతారని, ఇలాంటి వారిని తిరిగి మాములు స్థితికి తీసుకొచ్చేందుకు ధ్యానం తోడ్పడుతుందని, అవసరమైన చికిత్స అందజేయాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ ను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలోనూ పలు సందర్భాల్లో జిల్లాలోని విద్యాసంస్థలలోని విద్యార్థులకు వివిధ మంచి విషయాలపై కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతలో నెగిటివిటీని పోగొట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలపై అనేక అంశాలు ఒత్తిడిని కలిగిస్తున్నాయని, సున్నిత మనస్కులపై ఇది తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ తమ పిల్లలు మంచి పౌరులుగా ఎదిగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. "వికసిత భారత్ దిశగా ఒక ముందు అడుగు" నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నషా ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, డిడబ్ల్యూఓ సునంద, డా. మోహన్ రావు, డా. లక్ష్మీకాంతమ్మ, డా. మహేందర్, బ్రహ్మకుమారిస్ గద్వాల ప్రతినిధి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతే సమర్థ పోలీసింగ్‌కు బలమైన ఆయుధం..

***శాంతినగర్ సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో సమగ్ర తనిఖీ చేసిన డిఐజీ ఎల్.ఎస్. చౌహాన్***





వడ్డేపల్లి ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్. అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకుంటూ ప్రజా సేవలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం డీఐజీ శాంతినగర్ సర్కిల్ కార్యాలయం, శాంతినగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సమక్షంలో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ముందుగా శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఆవరణ పరిశుభ్రత, స్టేషన్ రికార్డులు, సిబ్బంది బ్యారక్స్, కిట్ ఆర్టికల్స్, స్వాధీనం చేసుకున్న వాహనాలు, కేసు ఆస్తుల నిర్వహణ, రిసెప్షన్ విధానం, బీట్ వ్యవస్థ, రౌడీ, హిస్టరీ షీటర్ల పర్యవేక్షణను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రి బీట్‌లను మరింత సమర్థంగా నిర్వహించాలని, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతం చేసి నేరాల నియంత్రణను బలోపేతం చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు.

సీసీటీఎన్ఎస్-2.0, ఈ-సాక్ష్య, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, టెక్‌డాటం, దర్పణ్, సీడీఆర్, బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలపై ప్రతి పోలీసు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగిస్తే నేరాల నియంత్రణ, దర్యాప్తు, ప్రజా సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పారు. స్టేషన్ రికార్డుల్లో పెండింగ్ లేకుండా నిర్వహించాలని, వర్టికల్ వారీగా బాధ్యతలు అప్పగించాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ వాహనాల తనిఖీలు, డయల్-112 కాల్స్‌కు తక్షణ స్పందన, బ్లూ కోల్ట్స్ పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణపై పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన డీఐజీ వారి విద్యార్హతలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా ఐకమత్యంతో పనిచేయాలని, ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా ప్రవర్తించాలని సూచించారు. వ్యక్తిగత జీవితం, విధి నిర్వహణ మధ్య సమతుల్యత పాటిస్తూ పోలీస్ యూనిఫామ్‌కు ఉన్న గౌరవాన్ని నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. అనంతరం శాంతినగర్ సర్కిల్ కార్యాలయంలో కేసుల పర్యవేక్షణ విధానం, పరిపాలనా వ్యవస్థ, కార్యాలయ రికార్డులు, పెండింగ్ అంశాలు, నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరిచేలా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రతి కేసు పురోగతిని నిరంతరం సమీక్షించాలని అధికారులకు సూచించారు. శాంతినగర్ సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరిపాలనా వ్యవస్థ, సాంకేతిక వనరుల వినియోగం, సిబ్బంది పనితీరుపై డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, శాంతినగర్ సి.ఐ. శంకర్, ఎస్.ఐ. నాగశేఖర్ రెడ్డి, శాంతినగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సమరశంఖం

**- ఆగస్టు 15న ఘనంగా నిర్వహణకు**

**సిద్ధతలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు**




మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , ఆగస్టు 6(విజన్ ఆంధ్ర): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈ నెల 15న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థకు ఆదేశించారు. ముఖ్య అతిథి ప్రసంగానికి సంబంధించి జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళిక అధికారిని కోరారు.పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సమాచార శాఖకు, వేదికను పూలతో అలంకరించాలని ఉద్యాన శాఖకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులతో జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖను ఆదేశించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా షామియానాలు, కూర్చోవడానికి సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.వివిధ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు, ప్రతి శాఖ నుంచి ఇద్దరి పేర్లను ఈ నెల 10లోగా పంపించాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ శాఖ బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు.వేడుకల ఏర్పాట్లను ప్రారంభం నుంచి ముగింపు వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, సమయానికి పూర్తి చేయాలని ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్వో నిర్మల, ఆర్డీవో నవీన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1నాటి ధర్నాను విజయవంతం చేద్దాం


**- పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి**



నారాయణపేట , ఆగస్టు 6 ( విజన్ ఆంధ్ర) : ఉపాధ్యాయ సమస్యలపై సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధన్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువా రం పిఆర్టియు టిఎస్ ధన్వాడ మండల శాఖ అధ్యక్షులు కే. కిష్టయ్య , ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మ న్న, జిల్లా కార్యదర్శి శ్రీనివా సులు ఆధ్వర్యంలో మండ లంలోని పాఠశాలలలో పిఆర్టియు టీఎస్ 2026 -2027 విద్యా సంవత్సరా నికి సభ్యత్వ నమోదు కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అపరి ష్కృత ఉపాధ్యాయ సమ స్యల సాధన పిఆర్టియుతో నే సాధ్యమవుతుందని అన్నారు. పలు పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశిం చి మాట్లాడుతూప్రస్తుతము రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పి.ఆర్.సి, డి ఏ లు,బిల్లులు పెండింగ్లో పెట్ట డం సగటు ఉద్యోగ ఉపా ధ్యాయులకు ఇబ్బందిక రంగా పరిణమిచ్చిందని అన్నారు.ప్రభుత్వము వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవి ధంగా ప్రభుత్వము హెల్త్ కార్డ్స్ అమలులో ఉన్న సమస్యలను గురించి, కేంద్ర ప్రభుత్వము, హైకోర్టు 20 03 డీఎస్సీ ఉపాధ్యా యులకు పాత పెన్షన్ ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వము కాల యాపన చేయడం దురదృ ష్టకరమన్నారు. అదేవి ధంగా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపిఎస్ ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ అమ లుపరుస్తామని చెప్పి దాదా పు మూడు సంవత్సరాలై నా అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయు లలో అసహనం పెరిగిపో తుందని అన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభు త్వము వెంటనే సిపిఎస్ రద్దు, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలగజే యాలని అన్నారు. అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వా లని డిమాండ్ చేశారు. సంఘపక్షాన పెద్ద మొత్తం లో ఉపాధ్యాయులు పాల్గొనాలని, పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పి అర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షులు నాగార్జున రెడ్డి,సత్య నారాయణ జిల్లా ఉపాధ్య క్షులు గౌస్,నర్సింహా రెడ్డి, జిహెచ్ఎం రఘు మోహన్ , సురేష్ , రవి వర్మ గారు, రమేష్ లక్ష్మీ , చంద్రం నాయ క్ , వెంకటరాములు ,శిరీష , ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం అనురాధ, అనిత , రాధిక, చెన్నమ్మ, మానస, భారత మ్మ , భాస్కర్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.

# పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 6(విజన్ ఆంధ్ర)కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ప్రజావాణి దరఖాస్తులు, ఆర్‌టీఐ దరఖాస్తులు, కోర్టు కేసుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఫైళ్లను పరిశీలించే సమయంలో సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు, నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి స్పష్టమైన అభిప్రాయంతో ఫైల్‌ను సమర్పించాలని చెప్పారు. సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో లేదా తనతో చర్చించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.ఉద్యోగులు కాత్యలయం పనివేళల్లో సమయ పాలన పాటించాలని , బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని హెచ్చరించారు.ప్రతి సెక్షన్ ఉద్యోగి తన శాఖకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, తాజా మార్గదర్శకాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఫైళ్ళను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కొత్త ఫైళ్లను ముందుగా పరిష్కరించడం సరికాదని పేర్కొన్న కలెక్టర్, ముందుగా వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను స్వయంగా గుర్తించి పరిష్కారానికి చొరవ చూపే ఉద్యోగులను తాను గమనిస్తున్నానని తెలిపారు. కలెక్టరేట్‌కు ఉద్యోగులే వెన్నెముక అని, వారు సమర్థవంతంగా పనిచేస్తేనే కార్యాలయానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తుల పై సమీక్ష**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించి దరఖాస్తుదారులకు త్వరగా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గా.తహసీల్దార్ లేదా ఇతర శాఖలకు పంపాల్సిన దరఖాస్తులను వెంటనే ఫార్వర్డ్ చేయాలని చెప్పారు. అలాగే ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో కూడా ఎలాంటి జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ ప్రతివాదిగా ఉన్న కోర్టు కేసుల్లో సంబంధిత శాఖలు వెంటనే కౌంటర్ దాఖలు చేసి దాని ప్రతిని సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌ను ఏదైనా కేసులో పార్టీగా చేర్చిన వెంటనే ఆ విషయాన్ని పరిపాలన అధికారికి తెలియజేయాలని, కోర్టులో దాఖలు చేసిన అన్ని పత్రాల ప్రతులను సంబంధిత సెక్షన్‌లో రికార్డుగా భద్రపరచాలని సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణ రాజు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# "రోడ్డుపైనే వరి నాట్లు.. రైతుల వినూత్న నిరసన"

**"చెల్లాపూర్ రోడ్డు దుస్థితిపై ఆగ్రహం"- కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్తు తిరుమల్ రెడ్డి**



దుబ్బాక విజన్ ఆంధ్ర, ఆగస్టు 06: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో రహదారి దుస్థితిపై రైతులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. చెల్లాపూర్ వార్డులోని స్మశాన వాటికకు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం బురదమయంగా మారి.. గుంతలు గుంతలుగా తయారవుతోంది.దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే సమయంలో వాహనదారులు అవస్థలు పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్తు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు రోడ్డుపైనే వరి నాట్లు వేసి వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్తు తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ.. రహదారి అధ్వానంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ లు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.వెంటనే రోడ్డును బాగుచేసి రైతుల సమస్యను పరిష్కరించాలని సత్తు తిరుమల్ రెడ్డి, రైతులు కోరారు.

# ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి



అల్వాల్, ఆగస్ట్ 6, (విజన్ ఆంధ్ర):అల్వాల్ లో జేఏసీ ఉద్యమకారుల ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామ కాల్లో తెలంగాణ ప్రాంతం ఆన్యాయానికి గురైన విషయాన్ని తెలంగాణ ప్రజలకు తెలియజెప్పి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాది వేసిన గొప్ప సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ భావ జాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అన్నారు. మలి దశ ఉద్యమానికి దిక్సూచిగా తెలంగాణ జన హృదయాల్లో నిలిచిన ఆయన రాష్ట్ర సాధనకు కోసం చేసిన త్యాగం మరువలేనిదన్నారు. సబ్బండ వర్గాల సమగ్రాభివృద్ధి కోసమే తెలంగాణ స్వరాష్ట్రం అని తెలిపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి ని ప్రతి సంవత్సరం ఆగస్టు 6న నిర్వహించుకుంటారని తెలిపారు. ఆయన తెలంగా ణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమకారులుగా తెలంగా ణ ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అల్వాల్ వారి ఆధ్వర్యంలో ఉచిత డెంటల్, కంటి పరీక్షలు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ, పోతు రాజులు, ధూమ్ ధామ్ కార్యక్రమం ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి,సురేందర్ రెడ్డి, దయా కర్, పుట్నాల కృష్ణ, శోభన్ బాబు, సంతోష్, డోలి సుదీర్, రవి, లయన్ సత్య నారాయణ, ప్రవీణ్ కర్లే, పర్భన్ కౌర్, లయన్ జయంతి, వీణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని తప్పక చేరుకోవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- డ్రిప్ ఏర్పాటు, మొక్కల నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని తప్పక చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. డ్రిప్ సౌకర్యం కల్పించడం, ఆయిల్ పామ్ మొక్కల నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రి-యునిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయిల్ పామ్ సాగు పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన కలెక్టర్, డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరా ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత కంపెనీల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్. శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు, సంబంధిత కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్‌కు ఘన నివాళి

**- జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్**





గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేసి, తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ కె. శంకర్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ఆరు దశాబ్దాల పాటు నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. ఆయన త్యాగం, నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజాసేవే పరమావధిగా పోలీసు శాఖ పనిచేస్తోందని, జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డి.ఎస్పీ నరేందర్ రావు, కార్యాలయ ఏ.ఓ. సాయికృష్ణ, గద్వాల సి.ఐ. టంగుటూరి శ్రీను, ఆర్.ఐలు వెంకట్, హరీఫ్, ఆర్.ఎస్.ఐలు, ఎస్.ఐలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోయింగ్ బిల్డ్ ప్రోగ్రామ్ విజేతల ప్రకటింపు



హైదరాబాద్, ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర) : బోయింగ్ ఇండియా 2025-26 బిల్డ్ ప్రోగ్రామ్ విజేతలుగా ఏరోసెర్చ్ టెక్నాలజీస్, ఆల్కామీ కార్బన్, దయాసోల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎర్త్‌స్ప్రింట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఓరీజాయ్ మెడ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, స్టెల్‌ఎక్స్ డైనమిక్స్, ఎస్‌డబ్ల్యూఆర్‌ఎన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్లను ప్రకటించింది. విజేతలకు ఒక్కో జట్టుకు రూ.10 లక్షల గ్రాంట్‌తో పాటు బోయింగ్, ఇంక్యుబేటర్ భాగస్వాముల మార్గదర్శకత్వం అందనుందని బోయింగ్ ఇండియా దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్డ్ ద్వారా ఇప్పటివరకు ఏడు వేలకు కుపైగా దరఖాస్తులు స్వీకరించి, 35కుపైగా స్టార్టప్‌లకు మద్దతు అందించినట్లు సలీల్ గుప్తే తెలిపారు. యువ ఆవిష్కర్తలకు బిల్డ్ కీలక వేదిక అని స్టేసీ సైర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సైన్ - ఐఐటి ముంబై, ఎఫ్ఐటీటీ - ఐఐటి ఢిల్లీ, ఐఐటి గాంధీనగర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్, ఐఐటి మద్రాస్ ఇంక్యుబేషన్ సెల్, ఎఫ్ఎస్ఐడీ - ఐఐఎస్‌సి బెంగళూరు, టి-హబ్ హైదరాబాద్, కేఐఐటి భువనేశ్వర్ - టీబీఐ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## భూమి పరీక్ష పై విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు



భూపాలపల్లి జిల్లా 06 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : జిల్లాలో ఉన్నటువంటి PMSRI పాఠశాలలు అయిన మోడల్ స్కూల్ మల్హర్ రావు,మోడల్ స్కూల్ ఘన్పూర్ ములుగు, సోషల్ వెల్ఫేర్ చిట్యాల్ జెడ్పిహెచ్ఎస్ గొల్లబుద్ధారం ,జడ్పిహెచ్ఎస్ చెల్పూర్ పాఠశాలలోని మొత్తం 275 మంది విద్యార్థిని విద్యార్థులకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆశ్రమ హైస్కూల్ బాలికల పాఠశాలలో జిల్లా , భూమిలో ఉన్న పొటాషియం, కాల్షియం ఫాస్ఫరస్, ఐరన్ , కార్బన్. మరియు భూమిలో ఉన్న ఆమ్లత్వము , ఎలక్ట్రో కండక్టివిటీ మొదలగు పదార్థాలు ఏ మోతాదులో ఉన్నాయో తెలుసుకునే విధంగా విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా పరీక్షలు చేసి చూపించడం జరిగింది. భూమిలో పెరిగిపోతున్నటువంటి కాలుష్యమును, బారలోహాలను ఎలా తగ్గించాలి, భూమికి మంచి పోషక విలువలు ఏ విధంగా అందించాలి మొదలగు అంశాలను ప్రయోగపూర్వకంగా చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ బాబూరావు , జిల్లా సైన్స్ అధికారి బి. స్వామి త్రివేణి , రాజ్ వివిధ పాఠశాలల సైన్స్ టీచర్స్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జయశంకర్ పాత్ర కీలకమైనది

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 06,(విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, జిల్లా అధికారులతో కలిసి హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆచార్య జయశంకర్ పోషించిన పాత్ర కీలకమైనదని, తెలంగాణ ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాలలో మార్పులు తీసుకువచ్చి అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేశారని, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రత్యేక పాత్ర పోషించారని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ తెలంగాణగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మహనీయుల ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా రావాలని తెలిపారు. అంతకుముందు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ముందు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. తద్వారా పర్యావరణంలో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, భావితరాలకు స్వచ్ఛమైన, సహజమైన సమతుల్య వాతావరణాన్ని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు కృషి

**- ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా లోని ర్యాలంపాడు, చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి పునరావాస గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో సదుపాయాలపై కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో నిర్వాసితులందరూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ర్యాలంపాడు ఆర్ అండ్ ఆర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణానికి ఇంకా 5 ఎకరాల భూమిని సేకరించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్లాట్లను మంజూరు చేస్తామన్నారు. ఆయా పునరావాస గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలల భవన నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆలయాల నిర్మాణం, ఇతర పనులన్నింటినీ వేగవంతం చేసి నిర్వాసిత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వస్తుండడంతో జూరాల కుడి కాలువ పరిధిలో ఆయకట్టు రైతులు వరి సాగు చేస్తే పంట చేతికొచ్చే వరకు నీటి విడుదల విషయంలో, చివరి డిస్ట్రిబ్యూటరీతో పాటు ఆర్డీఎస్ లింక్ కాలువలకు నీళ్లు అందించే విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించడం జరిగిందని కలెక్టర్ తెలియజేశారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు స్పందిస్తూ రైతులు వరి సాగు చేయడం, పంటలు చేతికొచ్చే వరకు నీటి లభ్యత ఆధారంగా కాలువలకు నీటిని విడుదల చేసే అంశాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ శ్రీనివాసరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇతర ఇరిగేషన్ అధికారులు, సంబంధిత మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన మహనీయుడు ఆచార్య జయశంకర్

**- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 6, ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆచార్య జయశంకర్ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఉద్యమానికి మార్గదర్శకుడిగా, సలహాదారుడిగా విశేష సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అసమానతలపై నిరంతరం పోరాటం చేసి తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తిగా ఆయన నిలిచారని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ ముఖ్య పాత్ర పోషించి, అధ్యాపకుడిగా అనేక మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వృత్తిపట్ల నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత, తెలంగాణ పట్ల అంకితభావాన్ని పెంపొందించారని కలెక్టర్ అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి కలిగిన సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు . అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్య అనేది కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా జ్ఞానం, విలువలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించే సాధనంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లలు తమ ఆశయాలను సాకారం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని, ప్రతి చిన్నారి విద్యాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో చైతన్యపరిచి, రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా ఆయన చేసిన కృషి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ ఫర్ చేంజ్ లెవల్1 ఫౌండేషనల్ లిటరసీ

**- టీచ్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో 10 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్మార్ట్ క్లాస్‌రూమ్ శిక్షణ**




భూపాలపల్లి జిల్లా 06 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : ప్రముఖ నటి, సామాజిక సేవకురాలు లక్ష్మీ మంచు 2014లో స్థాపించిన స్వచ్ఛంద సంస్థ 'టీచ్ ఫర్ చేంజ్', జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహముత్తారం మరియు భూపాలపల్లి మండలాల్లో సంస్థ దత్తత తీసుకున్న 10 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కోసం స్మార్ట్ క్లాస్‌రూమ్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ భూపాలపల్లి సహకారంతో నిర్వహించింది. ఈరోజు శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు స్మార్ట్ క్లాస్‌రూమ్ పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించడం, డిజిటల్ బోధనా విధానాలను తరగతి గదిలో అమలు చేయడం, విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించడం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ సందర్భంగా టీచ్ ఫర్ చేంజ్ రూపొందించిన లెవల్1 ఫౌండేషనల్ లిటరసీ పాఠ్యాంశాన్ని కూడా ప్రారంభించారు. ఇందులో ఆల్ఫాబెట్ వర్డ్స్ మరియు ఫోనిక్ వర్డ్ ఫ్యామిలీ ఆధారంగా చిన్నారుల్లో ప్రాథమిక అక్షరాస్యత, చదవడం, ఉచ్చారణ నైపుణ్యాలను పెంపొందించే విధానాలను ఉపాధ్యాయులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని టీచ్ ఫర్ చేంజ్ స్మార్ట్ క్లాస్‌రూమ్స్ హెడ్ మరియు ట్రైనింగ్ ఆఫీసర్ చంద్రిక, సాయి కిరణ్ మరియు, జై ఫీల్డ్ సూపర్‌వైజర్ నిర్వహించారు. ఆమె ఉపాధ్యాయులకు స్మార్ట్ క్లాస్‌రూమ్ పరికరాల వినియోగం, డిజిటల్ కంటెంట్ ద్వారా బోధన, కార్యకలాపాల ఆధారిత అభ్యాసం మల్టీమీడియా పాఠాల వినియోగం వంటి అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. అలాగే ఫౌండేషనల్ లిటరసీ పాఠ్యాంశాన్ని రోజువారీ బోధనలో సమర్థవంతంగా ఎలా అమలు చేయాలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక ఆధారిత విద్యను ప్రోత్సహించడం, ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడం, విద్యార్థులకు నాణ్యమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం సమగ్ర శిక్ష అభియాన్ మరియు జాతీయ విద్యా విధానం2020 (NEP 2020) లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయబడుతోంది. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో ఈ సంస్థ సానుకూల మార్పును తీసుకువస్తోంది అన్నారు.

## ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

గట్టు ఆగస్టు 6( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా రైతులకు ఎరువులను తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే విక్రయించాలని, విక్రయించిన ప్రతి ఎరువు, పురుగుమందుకు వెంటనే బిల్లు జారీ చేయాలని దుకాణదారులకు సూచించారు. కాలం చెల్లిన ఎరువులు లేదా పురుగుమందులను దుకాణాల్లో నిల్వ ఉంచితే వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీలలో కొన్ని దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం గుర్తించి, సంబంధిత దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గద్వాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రతాప్ కుమార్, గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు ఆదిలాబాద్ షీ టీమ్ అండ: ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, ఆగస్టు 06 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లాలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం షీ టీమ్ జూలై నెల పనితీరును ఆయన సమీక్షించారు. జూలైలో ఆకతాయిలపై 95 ఈ-పెట్టీ కేసులు, ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 23 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. 157 హాట్‌స్పాట్లలో నిఘా ఉంచి, 71 అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు "పోలీస్ అక్క" తోబుట్టువులా భరోసానివ్వాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర వేధింపులకు డయల్-100 లేదా 8712659953 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## పేట నుండి తెలంగాణ సంకల్ప సభకు తరలివెళ్ళిన నాయకులు



నారాయణపేట, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్ సరూర్ నగర్ లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు నారాయణపేట నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి గవినోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్ళారు.ఈ కార్యక్రమం లో భాగంగా నారాయణ పేటజిల్లా కేంద్రం లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమానాలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సృష్టికర్త ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. టిఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితమ్మ సామాజిక న్యాయం కోసం పార్టీని ఏర్పాటు చేశారని అన్నారు. టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్టం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ సంకల్ప సభకు ఊహించని రీతిలో పార్టీ శ్రేణులు రావడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్,దామర్ గిద్ద మండలం అధ్యక్షులు నర్సింహా రెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్,లోకుర్తి మనిక్యప్ప,లింగారెడ్డి పల్లి నారాయణ,పిల్లే బండ నర్సిములు, నర్సాపూర్ లాలప్ప, పాకిరప్ప, అశోక్, విట్లపూర్ బీమాషాప్ప,నర్సప్ప,అశన్ పల్లి నారాయణ రెడ్డి,రమేష్,నర్సింహా గ్రామ అధ్యక్షులు, కేశవ్, లోకుర్తి వెంకటప్ప, దేశాయ్ పల్లి శ్రీనివాస్,అప్పంపల్లి రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 06 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణా సిద్ధాంత కర్తగా పేరు పొందిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కల్లెక్ట్రేట్ కార్యాలయం సమావేశము హాలు నందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి వేడుకలు పురష్కరించుకొని వారి యొక్క సేవలను కొనియాడారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ బాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణా ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని , తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త అని వారి ఉద్యమ స్ఫూర్తిని, సేవలను కొనియాడారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ స్వర్ణలత,వెనుకబడిన తరగతుల అబివృద్ధి అధికారి మాధవ రెడ్డి ,జయపాల్ రెడ్డి ,శ్రీధర్ రెడ్డి,జిల్లా అధికారులు , కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు

**- మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్**



మల్కాజిగిరి, ఆగస్ట్ 6, (విజన్ ఆంధ్ర): డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుం టానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దస్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని, ఆదివారం బోనాల పండుగ జరుపుకుంటామని ఇకనైనా ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి ఆయన వెంటనే స్పందించారు. జలమండలి మేనేజర్ సీరజ్, హైడ్రా అశోక్ లకు ఫోన్ చేసి, పిలిపించి మురుగు నీటిని క్లిన్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, చుంకు శ్రీనివాస్, ఉపేందర్, కాలనీ వాసులు అబ్దుల్ నజీర్, శ్రీనివాస్ గౌడ్,మొసిన్, జవీద్, పోచయ్య, శివకుమార్, టిప్పు,గణేష్ తదితరులు పాల్గొన్నారు

# భూ భారతి అమలుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూళ్ల శిక్షణ**




కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూ భారతి వ్యవస్థ సమర్థవంతమైన అమలుకు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ×ఙుాజ ా20 మీటింగ్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆకిత్ ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం, నూతన నిబంధనల అమలులో అధికారులు పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు ప్రతి దరఖాస్తును చట్టబద్ధంగా పరిశీలించి బాధ్యతాయుతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనంత రామకృష్ణ భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూళ్ల అమలు విధానం, పత్రాల పరిశీలన, వ్యవస్థలో అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులకు సవివరంగా అవగాహన కల్పించారు. జిల్లాలోని మండల, డివిజన్, కలెక్టరేట్ స్థాయి జూనియర్ అసిస్టెంట్లు ఈ శిక్షణలో పాల్గొని భూ భారతి మాడ్యూళ్లపై సమగ్ర అవగాహన పొందారు. మాస్టర్ ట్రైనర్స్‌గా కలెక్టరేట్‌కు చెందిన ఎన్. దిలీప్ కుమార్, కొత్తగూడెం డివిజన్‌కు చెందిన టి. రాజేష్, భద్రాచలం డివిజన్‌కు చెందిన ఎస్. సత్యేంద్ర కుమార్ వ్యవహరించారు. భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూళ్లను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ, వ్యవస్థలో అనుసరించాల్సిన ప్రతి దశను వివరించి శిక్షణ అందించారు.ఈ శిక్షణ ద్వారా జిల్లాలో భూ భారతి వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించేందుకు అవసరమైన అవగాహన కల్పించబడింది.

# రూ.3.50 కోట్ల విలువైన గంజాయి దహనం

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 32 కేసులకు సంబంధించిన 696.1 కిలోల మత్తు పదార్థం నిర్మూలన**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.3.50 కోట్ల విలువైన 696.1 కిలోల గంజాయిని గురువారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం దహనం చేశారు.ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ అనుమతి పొందిన గంజాయి నిర్మూలన కేంద్రం లిలిఏడబ్ల్యూఎస్ కన్సల్టింగ్, గొపాల్‌పేట్ (తల్లాడ మండలం)లిలిలో ఈ ప్రక్రియ చేపట్టారు. దహనం చేసిన గంజాయి వివరాలు ఇలా ఉన్నాయి: కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ 316.07 కిలోలు, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ 329.51 కిలోలు, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్ 43.62 కిలోలు, మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ 6.90 కిలోలు, మొత్తం నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో నమోదైన 32 కేసులకు సంబంధించిన 696.1 కిలోల గంజాయిని నిబంధనలకు అనుగుణంగా దహనం చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీనివాసరెడ్డి, సంబంధిత సీఐలు, ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొని గంజాయి దహన ప్రక్రియను పర్యవేక్షించారు.

## బి.ఎల్.నగర్ అధ్యక్షుడిగా కొంగల నర్సింహా ఏకగ్రీవ ఎన్నిక

**- నూతన కార్యవర్గాన్ని సన్మానించిన కొత్త కిషోర్ గౌడ్, పోగుల దిలీప్ రెడ్డి**



బోడుప్పల్,ఆగస్ట్ 06(విజన్ ఆంధ్ర): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బి.ఎల్.నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా కొంగల నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొంగల నర్సింహతో పాటు కార్యవర్గ సభ్యులనుమేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. బి.ఎల్.నగర్ కాలనీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని వారు తెలిపారు.అనంతరం నూతన అధ్యక్షుడు కొంగల నర్సింహ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కాలనీ అభివృద్ధిపదంలో తీసుకవెళ్ళడానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి.....

**- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 6,(విజన్ ఆంధ్ర) జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు (రేషనలైజేషన్) ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్ అధికారులతో అన్నారు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై సమీక్షించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రతి పాఠశాలలో అవసరమైన మేరకు ఉపాధ్యాయుల కేటాయింపును చేపట్టాలని అన్నారు . సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు, సీనియారిటీ మరియు విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి , జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మరియు జిల్లాలోని 15 మండలాల మండల విద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ జీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ గారి జయంతి వేడుకలు

**- ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

**- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

**- తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుదామని ఓబీసీ నేతలు పిలుపు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 6 ( విజన్ ఆంధ్ర ): తెలంగాణ సిద్ధాంతకర్త, తొలి మలిదశ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్ పుట్టినరోజు సందర్భంగా ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్(ఓబీసీ ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు...జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు..ఈ కార్యక్రమానికి కూడా మాజీ చైర్మన్,ఓబిసి చైర్మన్ ఎస్ . సుందర్ రాజ్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు......సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమానికి ఒక దశ–దిశ దిక్సూచి సిద్ధాంతకర్త తన జీవితాన్ని ధారబోసి లక్షలాదిమంది ఉద్యమకారులను తయారు చేశారని గుర్తుచేశారు.. ప్రొఫెసర్ జయశంకర్ నీళ్ళు ,నిధులు, నియమాకుపైన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల పట్ల విద్యార్థుల పట్ల రైతాంగం పట్ల విపక్షతను ప్రజలకు చాటి చెప్పి ఉత్తేజపరిచి పోరాటాల వైపు మళ్లించిన వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు.. జయశంకర్ సార్ జన్మదిన సందర్భంగా ఆయన పుట్టినరోజును తెలంగాణ అస్తిత్వ దినమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.....ఈ కార్యక్రమంలో జయశంకర్ సార్ కొలీగ్, ఓబీసీ జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ...... తెలంగాణలో ఉన్న ప్రతి ఆర్థిక పరిస్థితి పైన అధ్యయనం చేసి తెలంగాణ రాక ముందుకు టీచర్లకు అధ్యాపకులకు విద్యార్థులకు ప్రవేట్ లో ఉన్న అన్ని సెక్టార్ల ప్రజలకు చైతన్య పరిచిన వ్యక్తి జయశంకర్ అన్నారు....జయశంకర్ సార్ చరిత్ర తెలుసుకుంటే ప్రతి విద్యార్థి విద్యార్థిని, విద్యార్థులు తమ జీవితాలను సక్రమార్గంలో ఉంటారన్నారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం స్టేట్ అడ్వైజర్ వేణుమాధవ్, గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బండా వివేకానందం, తెలంగాణ సమాలోచన అధ్యక్షుడు శ్రీనివాస్, నాగరాజు, రాజ్ కుమార్ , రావుల గుండేటి చక్రపాణి ,అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రతి నవజాత శిశువుకు కంటి పరీక్షలు తప్పనిసరి

**- పుట్టుకతో వచ్చే కంటి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించాలి - జిల్లా కలెక్టర్ అంకిత్**




కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : నవజాత శిశువుల్లో పుట్టుకతో వచ్చే కంటి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు ప్రతి శిశువుకు జననం అనంతరం కంటి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎన్–బ్లెస్ కింద నిర్వహించిన యూనివర్సల్ న్యూ బోర్న్ బేబీస్ ఐ స్క్రీనింగ్ (ఆర్క్ లైట్ ఎగ్జామినేషన్) శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశువుల్లో కంటి సమస్యలను తొలి దశలోనే గుర్తించడం ద్వారా భవిష్యత్తులో అంధత్వాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రతి శిశువుకు నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఆర్క్ లైట్ పరికరం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలకు సూచించారు. ఈ శిక్షణతో ఆరోగ్య సిబ్బంది నైపుణ్యాలు మరింత మెరుగుపడి చిన్నారులకు నాణ్యమైన సేవలు అందుతాయని తెలిపారు.శిక్షణలో ఆర్క్ లైట్ పరికరం వినియోగం, రెడ్ రిఫ్లెక్స్ పరీక్ష, పుట్టుకతో వచ్చే కంటి లోపాల గుర్తింపు, రిఫరల్ విధానం తదితర అంశాలపై ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు సవివరంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. రాందాస్, డా. దినేష్, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, జిల్లాలోని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ,ఏఎన్ఎంలు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి సిద్ధాంత స్వరం ప్రొఫెసర్ జయశంకర్

**- ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసి, తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశయంగా భావించి తన జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాక తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహా మేధావి అని ప్రశంసించారు. ప్రొఫెసర్ జయశంకర్ రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు తెలంగాణ ఉద్యమానికి మేధస్సుతో పాటు మార్గదర్శకత్వాన్ని కూడా అందించాయన్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం వెనుక ఉన్న జయశంకర్ విద్యారంగంలో చేసిన కృషి, సమానత్వం, ప్రాంతీయ న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన అధ్యయనాలు ఈ తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కొత్తపల్లి జయశంకర్ జీవితాంతం తెలంగాణ హక్కుల కోసం పోరాడిన మహానేతలలో ప్రముఖులుగా నిలిచిపోతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ సి. వసతిగృహాల్లో వాచ్మెన్స్, కుక్స్, కామాటి పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి**



అయిజ ఆగస్టు 5 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ వెనుకబడిన అలంపూర్ నియోజకవర్గం లో షెడ్యూల్ కులాల బాలుర వసతిగృహాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. వసతిగృహాల్లో విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, భోజన నిర్వహణ వంటి కీలక బాధ్యతలను నిర్వహించేందుకు అవసరమైన వాచ్మెన్, కుక్, కామాటి పోస్టులు ఖాళీగా ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.కొన్ని వసతిగృహాల్లో అవసరమైన సిబ్బందికి బదులుగా ఒకరిద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాచ్మెన్ అందుబాటులో లేకపోవడం విద్యార్థుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల వసతి, భోజనం, పరిసరాల పరిశుభ్రత, రాత్రివేళ భద్రత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని తగినంత మంది సిబ్బంది ఉండటం అత్యవసరం అని అన్నారు. కావున సంబంధిత అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని నియోజకవర్గం లో అన్ని షెడ్యూల్ కులాల వసతిగృహాల్లో ఖాళీగా ఉన్న వాచ్మెన్, కుక్, కామాటి పోస్టులను గుర్తించి, ఔట్‌సోర్సింగ్ విధానంలో వెంటనే భర్తీ చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ప్రజలు కోరుతున్నారు.విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి అని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి పార్టీ అయిజ మండల అధ్యక్షులు గోపాల కృష్ణ, పట్టణ అధ్యక్షులు తెలుగు నరసింహ, నాయకులు కంపాటి భగత్ రెడ్డి,లక్ష్మణ్ గౌడ్,ప్రతిప్ , చాకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలి

**- ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 06,(విజన్ ఆంధ్ర ) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే విధంగా కష్టపడి చదవాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ అన్నారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా కష్టపడి చదవాలని, ప్రభుత్వ సేవలలో అవకాశాలు, పోటీ పరీక్షలకు క్రమశిక్షణతో సన్నద్ధం కావాలని తెలిపారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, క్రీడలలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్తు లక్ష్యాల వివరాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌నగర్‌లో రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులు

**- పనులను పరిశీలించిన మాజీ మేయర్, డివిజన్ అధ్యక్షుడు,నాయకులు**



బోడుప్పల్, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర): మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ అంబేద్కర్‌నగర్ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్,కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు జరుగుతున్న సమయంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, నాయకులు దానగళ్ల యాదగిరి, రాజీవ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గోపు రాములు, నానాజీ, సురేష్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు మా గ్రామంలోకి రావాలి

**- నీలిపల్లి గ్రామ ప్రజలు, విద్యార్థులు**




మల్దకల్ ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామంలోని విద్యార్థులు ప్రతిరోజూ స్కూల్, కాలేజీలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు మా గ్రామంలోకి రాక పోవడంతో చిన్నపిల్లలు, బాలికలు, విద్యార్థులందరూ గ్రామం బయట ఉన్న స్టేజి వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మా గ్రామంలోనికి ఆర్టిసి బస్సు వచ్చేటట్లు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నీలిపల్లి గ్రామ స్టేజి వద్ద గ్రామ సర్పంచ్ , ఉపసర్పంచ్ , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలందరం కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి నీలిపల్లి గ్రామంలోకి ఆర్టీసీ బస్సు వచ్చి విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, పెద్దలు, విద్యార్థులు కోరారు.

# కృష్ణమ్మ జలకలతో పరవళ్ళు..

**- తీర గ్రామాల ప్రజలకు హెచ్చరిక**

**- జూరాల ప్రాజెక్టుకు భారీ వరద, 29 గేట్లను ఎత్తి నీటిని విడుదల**



గద్వాల ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద కొనసాగుతోంది. వరద ఉద్ధృతి పెరగడంతో ప్రాజెక్టు అధికారులు గురువారం ఉదయం 29 గేట్లను ఎత్తి కృష్ణానదిలో భారీగా నీటిని విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2,42,645 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఇందులో అధిక భాగం నీటిని 29 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే జూరాల జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, సాగునీటి కాలువలు, లిఫ్ట్ పథకాల ద్వారా కూడా అవసరమైన మేరకు నీటిని వదులుతున్నారు. మొత్తం 2,40,319 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతోంది.జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.48 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే ప్రాజెక్టు దాదాపు నిండే స్థితికి చేరుకుంది. భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదిలోకి చేపల వేటకు వెళ్లరాదని, నది ఒడ్డున అనవసరంగా సంచరించవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి - కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమ స్ఫూర్తిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేస్తూ, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో చైతన్యంగా మలచడంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. సమాజం పట్ల నిబద్ధతతో జీవితాంతం సేవలందించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా

**- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, అధికారులు**



నిజామాబాద్, ఆగస్టు 06 : (విజన్ ఆంధ్ర )నిజామాబాద్ జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా భవేష్ మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఇంచార్జి కలెక్టర్ ను అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత తదితరులు సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ ను వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమావేశమై వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

## కలెక్టరేట్ లో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

**- పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 06,(విజన్ ఆంధ్ర); జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. మొదటగా అధికారులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా ఆయన మాట్లాడుతూ, ఆజన్మాంతం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని ఉద్యోగులు, మేధావులు, కళాకారులకు, తెలంగాణ ప్రజానీకానికి తెలియజెప్పి, స్వరాష్ట్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ఆనాటి కాలంలో తెలంగాణలోని సబ్బండ వర్గాలను ఏకం చేసి తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ముందుండి నడిపించారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రాన్ని అధికారులు సమిష్టి కృషితో అభివృద్ధి చేసినప్పుడు ఆయనకి ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. తెలంగాణ జాతి హితం కోసం ఎన్నో రచనలు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి మేధావుల జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. నేటి తరం వారికి ప్రొఫెసర్ జయశంకర్ గొప్పతనాన్ని తెలియజేయాలని తెలిపారు. ఆచార్య జయశంకర్ ఆలోచనలు మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ జయంతి వేడుకలలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, డిఈఓ భోజన్న, జిల్లా ఖజానా అధికారి సరోజ, ఎల్డిఎం రామ్ గోపాల్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ గ్రామ చెరువు కట్ట తెగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య



నిజామాబాద్ ఆగస్టు06:( విజన్ ఆంధ్ర ) : బుధవారం అర్ధరాత్రి సమయంలో సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో ఉన్న చెరువు కట్టకు భారీగా భంగ పడటంతో చెరువు కట్ట తెగిపోయి , చెరువులోని నీరు పూర్తిగా బయటకు వెళ్లిపోయింది. ఈ ఘటనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.ఈ నేపథ్యంలో నేడు లిగౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్., సంఘటన స్థలాన్ని సందర్శించి చెరువు కట్ట పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. చెరువు కట్ట తెగిపోవడానికి గల కారణాలు , నీటి ప్రవాహం దిశ , జరిగిన నష్టం , సమీప గ్రామాలపై ప్రభావం , ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఘటన అనంతరం పోలీసులు అప్రమత్తమై స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రజలు సంచరించకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని , అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు పికెట్లను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చెరువులు , వాగులు , కాలువలు , వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు ప్రజలు వెళ్లరాదని , పిల్లలను నీటి వనరుల వద్దకు పంపవద్దని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 112 కు సంబంధిత సమాచారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ధర్పల్లి సి.ఐ శ్రీ బిక్షపతి , సిరికొండ ఎస్.ఐ శ్రీ జె. రామకృష్ణ , ధర్పల్లి ఎస్.ఐ శ్రీ జి. సందీప్ , గ్రామ సర్పంచ్ శ్రీ మానస శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోపాలపురం పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన కలెక్టర్**

**- ఉపాధ్యాయినితో మాట్లాడిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్**



హైదరాబాద్: గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలమైన తీరుపై లిఈనాడులి పత్రికలో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే పాఠశాలను సందర్శించి, వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దివాకరంను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడారు. పాఠశాలలో పరిస్థితులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ దివాకర గురువారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ. 25 లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆమెకు తెలియజేశారు. ఆ వెంటనే నిధులు మంజూరు చేశారు.

## కల్వకుర్తిలో హరిత సందడి - 1000 మంది విద్యార్థులతో వన మహోత్సవం“

**- ఎమ్మెల్యే, మున్సిపల్ నేతలతో కలిసి మొక్కలు నాటిన విద్యార్థులు**

**- “ఒక చెట్టు, ఒక జీవితం“ అంటూ ప్రతిజ్ఞ..**







ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, కల్వకుర్తి,ఆగస్ట్ 06,విజన్ ఆంధ్ర: పచ్చదనంతో కల్వకుర్తిని అలరించేందుకు మున్సిపాలిటీ చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.గురువారం పట్టణంలోని ఎంజేపీ బాలుర పాఠశాల, ఎంజేపీ బాలికల పాఠశాల ప్రాంగణాలు మొక్కల నాటే కార్యక్రమంతో హరితమయ్యాయి.(ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వారితో పాటు కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ శానవాజ్,మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ షేక్, కౌన్సిలర్ ఏజాస్ వివిధ శాఖల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమానికి 1000 మందికి పైగా విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. “ప్రకృతిని కాపాడతాం, పచ్చని భవిష్యత్తును నిర్మిస్తాం“ అంటూ విద్యార్థులందరూ చేతులెత్తి ప్రతిజ్ఞ చేశారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని దానిని పెంచే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. మాట్లాడిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తిని గ్రీన్ సిటీగా మార్చేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తోందని, ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణే మన భవిష్యత్ తరాలకు మనమిచ్చే గొప్ప బహుమతి అని అన్నారు.మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవం కేవలం ఒక కార్యక్రమం కాదని, ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. రోడ్ల వెంబడి, పార్కుల్లో, పాఠశాలల్లో భారీగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు... “నేడు ఒక చెట్టు నాటండి, రేపటిని కాపాడండి“ అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంచేందుకు దోహదపడింది...

## ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**- జయంతి వేడుకలో కలెక్టర్ భవేష్ మిశ్రా**



నిజామాబాద్, ఆగస్టు 06 : (విజన్ ఆంధ్ర )తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. 1969 ఉద్యమంతో పాటు మలి విడత ఉద్యమం లోనూ ప్రజలను ప్రత్యేకించి విద్యార్థులు, యువతను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఆశ, శ్వాసగా ఆరు దశాబ్దాల పాటు సుదీర్ఘంగా అలుపెరుగని కృషి చేస్తూ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందని, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు అన్ని వర్గాల వారు సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాగా, అంతకుముందు కంటేశ్వర్ చౌరస్తాలో గల ఆచార్య జయశంకర్ విగ్రహానికి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను శ్లాఘిస్తూ, జయంతి వేడుకలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారిణి రజిత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం

**- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**- హనుమకొండ జిల్లాలో సిపిఐ పాదయాత్ర ప్రారంభం**




కాజీపేట న్యూస్ ( విజన్ ఆంధ్ర ) : దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం ప్రారంభించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు హనుమకొండ జిల్లాలో పాదయాత్ర ప్రారంభం అయింది. జిల్లాలోని కాజీపేట పట్టణంలో ఈ పాదయాత్రను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ పాదయాత్ర కాజీపేటలోని వాటర్ ట్యాంక్ నుండి ప్రారంభమై కాజీపేట మార్కెట్, మడికొండ నుండి ధర్మ సాగర్ మండలం రాంపూర్, పెద్ద పెండ్యాల, ధర్మ సాగర్,సాయి పేట, ముప్పారం, పీచర, వేలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ప్రజాకంతక పాలన కొనసాగిస్తున్న బిజెపి పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో సంవత్సర కాలం పాటు కొనసాగిన రైతు ఉద్యమంతో పాటు ఇటీవల దేశ రాజధాని డిల్లీలో పెద్ద ఎత్తున జరిగిన విద్యార్థి, యువజనుల ఆందోళననే ఇందుకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. ఆగస్టు 6 నుండి ప్రారంభమైన ఈ దేశవ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కానుందని తెలిపారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని,స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇందులో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న బయ్యారం ఉక్కు కర్మాగారం, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం వంటివి ఉన్నాయని అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ తో సహా కీలకమైన జాతీయ, రాష్ట్ర సంపదను ప్రైవేటీకరించడానికి, సహజ వనరులను కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. మోదీ పాలనలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణులలో భాగంగా రాజకీయ వ్యతిరేకులను అణచివేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలను క్రమంగా నిర్వీర్యం చేయడం జరుగుతున్నాయి.వీటికి వ్యతిరేకంగా జరుగుతున్న సిపిఐ పోరు యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, ఎన్. అశోక్ స్టాలిన్,బత్తిన సదానందం, ఉట్కూరి రాములు, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టె వెంకటేశ్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, ప్రజానాట్యమండలి నాయకులు రొంటాల శ్యామ్,డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌కు ఘన నివాళి

**- తెలంగాణ సాధనలో ఆయన సేవలు చిరస్మరణీయం**

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ కూడా నివాళులర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం అంకితభావంతో చేసిన కృషి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఆయన చూపిన మార్గం, ఆయన సిద్ధాంతాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.సమాజ అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ముఖ్యంగా ప్రజాసేవలో ఉన్న అధికారులు, ఉద్యోగులు మరింత నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## రాజంపేటలో గ్రామపంచాయతీ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు...



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు6( విజన్ ఆంధ్ర) కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామపంచాయతీ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూర్స పోచయ్య ,గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను, ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాజంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ బూర్స పోచయ్య మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు,దూరదృష్టి, తెలంగాణ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడుతూ, ప్రతి ఒక్కరూ ఆయన ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త జయంతి వేడుకలు

**- ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రగతికి కృషి చేయాలి**

**- బోడుప్పల్ సర్కిల్ డీప్యూటీ కమిషనర్ ఏ శైలజ**



బోడుప్పల్,ఆగస్ట్ 06(విజన్ ఆంధ్ర) : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సంధర్భంగా ఆమే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సమాజం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రగతికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కొత్త చందర్ గౌడ్,ఆర్ఓ వెంకటేశ్వర్లు,మేనేజర్ ప్రవీణ్, డీఈఈసాయినాథ్ గౌడ్ ,ఏఈ రాకేష్ ,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి,శ్యాంసుందర్ రెడ్డి,రాకేష్,మధు, సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 6,( విజన్ ఆంధ్ర) : మలి దశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలు పంచుకున్న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ లతో కలిసి హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకువచ్చిన మహనీయుడని అన్నారు. మహనీయుల ఆశయాల సాధనకు అందరం భాగస్వామ్యులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు7 గురు నిందితుల అరెస్ట్,

*- రూ. 68 వేల నకిలీ నోట్లు,సామగ్రి స్వాధీనం*

*- నాగర్ కర్నూల్ డీఎస్పీ బురి శ్రీనివాస్.*




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): ఆగస్ట్ 06. : నకిలీ నోట్లను తయారు చేస్తూ చలామణికి పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠాను బిజినపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ దాడిలో 7 గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 68,000 విలువగల నకిలీ ₹500 నోట్లతో పాటు ప్రింటింగ్ యంత్రాలు, ప్రత్యేక కాగితాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలు.. తేదీ 01.08.2026న సాయంత్రం మంగానూరు గ్రామంలోని కనకదుర్గ వైన్స్ షాపులో ఒక వ్యక్తి రెండు ₹500 నకిలీ నోట్లు ఇచ్చి బీర్లు కొనుగోలు చేశాడు. క్యాషియర్ ఆ నోట్లను కౌంటింగ్ మిషన్‌లో వేయగా అవి నకిలీవిగా తేలాయి. వైన్స్ నిర్వాహకుడు రాగి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిజినపల్లి పోలీస్ స్టేషన్‌లో 205/2026 U/s 318(4), 179 BNS ప్రకారం కేసు చేసి దర్యాప్తు ప్రారంభించారు.విచారణలో భాగంగా గురువారం (06.08.2026) నాడు నాగర్‌కర్నూల్ CI వై. అశోక్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మంగానూరులోని బొల్ల కురుమూర్తి (A6) ఇంట్లో రైడ్ చేయగా, 7 గురు వ్యక్తులు గుమికూడి నకిలీ 500 నోట్లను ముద్రిస్తూ దొరికిపోయారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల A1 (కలిదిండి నాగరాజు) అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకుని A2, A3, A4, A7లతో కలిసి కలర్ జిరాక్స్ యంత్రాల ద్వారా రూ. 2 లక్షల విలువైన నకిలీ నోట్లను ముద్రించారు. A2 (శివ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన A5 (నవీన్ గౌడ్)కి 1,000 అసలు కరెన్సీకి 4,000 నకిలీ కరెన్సీ చొప్పున సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నాడు. దాని ప్రకారం A5 20,000 నిజమైన డబ్బులు ఇచ్చి 80,000 విలువైన నకిలీ నోట్లను తెచ్చుకుని A6కి 10,000, A8కి 70,000 పంచిపెట్టగా, A6 వాటిని స్థానిక డాబాలు, కిరాణా షాపులు, పెట్రోల్ బంకుల్లో చలామణి చేశాడు. నిందితుల వివరాలు: A1: కలిదిండి నాగరాజు (44), మీసేవా కౌంటర్, సిద్ధాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, AP. A2: ముదుండి శివ వెంకట ధర్మరాజు (37), ఆక్వా టెక్నీషియన్, కలువపూడి, పశ్చిమ గోదావరి జిల్లా, AP. A3: లక్కోజు అశోక్ కుమార్ (32), వీడియో ఎడిటర్, సిద్ధాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, AP. A4: బొమ్మగంటి ఎల్.ఎన్. సతీష్ కుమార్ (38), హోటల్ వ్యాపారం, తడికలపూడి, ఏలూరు జిల్లా, AP. A5: వంగా నవీన్ గౌడ్ (27), వ్యవసాయం, మంగానూర్, నాగర్‌కర్నూల్ జిల్లా, TS.A6: బొల్ల కురుమూర్తి (27), వ్యవసాయం, మంగానూర్, నాగర్‌కర్నూల్ జిల్లా, ఋ:ఞా7: అడపా పృథ్వీరాజ్ (33), సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, చింతలపూడి, ఏలూరు జిల్లా,ఞా. A8: జయమంగళసత్యనారాయణ (34), కైకలూరు, కృష్ణా జిల్లా, ఞా (ఫరారీలో).స్వాధీనం చేసుకున్న సొత్తు: 1.నకిలీ కరెన్సీ 68,000 విలువగల నకిలీ 500 నోట్లు. 2నిందితులమొబైలఫన్లు 07 3.01 న్యూ కలర్ జిరాక్స్ మిషన్, 01 కౌంటింగ్ మిషన్,Cottan Linen పేపర్లు, ప్రింట్ చేసిన నకిలీ పేపర్లు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన CI వై. అశోక్ రెడ్డి, SI SK. శంశొద్దీన్, సిబ్బంది భీముడు, ప్రవీణ్, రమేష్, శివలను డీఎస్పీ అభినందించారు. ప్రజలకు విజ్ఞప్తి: అనుమానాస్పదంగా లేదా నకిలీగా కనిపించే ఏ కరెన్సీ నోటు నూస్వీకరించవద్దు. నకిలీ నోట్ల తయారీ లేదా చలామణికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా 100 / 112 కు డయల్ చేసి సమాచారం అందించగలరు.

# జాజాపూర్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా రోబోటిక్స్ వర్క్ షాప్.




నారాయణపేట , ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌కు చెందిన రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ (రియా ) ఆధ్వర్యంలో, ఏ ఎం డి సహకారంతో ఒకరోజు ప్రాక్టికల్ రోబోటిక్స్ రీట్రైనింగ్ వర్క్‌షాప్ గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్ షాప్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో మొత్తం 48 విద్యార్థులు పాల్గొనగా వీరిలో 31 మంది బాలికలు, 17 మంది బాలురు ఉన్నట్లు పేర్కొన్నారు.గతంలో నేర్చుకున్న రోబోటిక్స్ అంశాలను మరోసారి ప్రాక్టికల్‌గా గుర్తు చేస్తూ, ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, మోటార్లు, సర్క్యూట్ బిల్డింగ్, రోబోటిక్ పార్ట్స్ వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ అందించారని అన్నారు. విద్యార్థులు స్వయంగా సర్క్యూట్లు తయారు చేయడం, రోబోటిక్ మోడళ్లను రూపొందించడం, వివిధ యాక్టివిటీల్లో పాల్గొనడం ద్వారా తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నారని అన్నారు. ఈ రీట్రైనింగ్ వర్క్‌షాప్ ద్వారా రోబోటిక్స్ క్లబ్ కార్యకలాపాలను మరింత చురుకుగా కొనసాగించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందుతుందని విద్యార్థులకు రాబోయే రియా ఇన్నోవేషన్ మీలాస్ గురించి వివరంగా తెలియజేసి, వివిధ ఇన్నోవేషన్ చాలెంజ్‌లలో పాల్గొనే విధంగా ప్రోత్సహించినట్లు వివరించారు.వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు పాల్గొన్న ధ్రువపత్రాలు అందజేయగా, పాఠశాలలో రోబోటిక్స్ కార్యకలాపాలు నిరంతరం కొనసాగేందుకు రోబోటిక్స్ ప్రాక్టీస్ కిట్‌ను పాఠశాల యాజమాన్యానికి, ఎంపిక చేసిన రోబోటిక్స్ క్లబ్ సభ్యులకు ఏ 1 పుస్తకాలను అందజేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ఏ ఎం డి కు సోహం రియా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. అలాగే జిల్లా అధికారులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది, విద్యార్థులు అంకితభావంతో శిక్షణ అందించిన రియా ట్రైనర్లకు వారి సహకారం, ఉత్సాహం, కృషికి ప్రత్యేక తెలిపారు. కార్యక్రమంలో సోహం అకాడమీ ట్రైనర్స్ అజయ్ కుమార్ స్వప్న విజయలక్ష్మి పాఠశాల ఉపాధ్యాయులు భాను ప్రకాష్ నిర్మల శశిరేఖ నరసింహ నర్సింలు రఘురాం రెడ్డి మధుసూదన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నరకయాతన

# తప్పేదెప్పుడు..!

- చినుకు పడితే చాలు... అంబేద్కర్ నగర్ చౌరస్తా మురుగు చెరువు
- ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో కాలనీల ప్రజలకు చుక్కలు
- వేలాది మంది రాకపోకలకు అడ్డంకి..అత్యవసర సేవలకు అడ్డంకి
- అధికారులకు వినతులు.. ప్రజాప్రతినిధులకు మొరలు..
- కదలని యంత్రాంగం.....అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న స్థానికులు




బోడుప్పల్/మేడ్చల్ జిల్లా,ఆగస్ట్ 06(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : నగరాభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్ చౌరస్తా మాత్రం నేటికీ డ్రైనేజీ సమస్యతో అల్లాడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా చాలు... డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డంతా వ్యాపిస్తుంది. ప్రధాన కూడలి చెరువును తలపిస్తూ రాకపోకలు స్తంభించిపోతాయి. దేవేందర్ నగర్, రాజీవ్ నగర్, అంబేద్కర్ నగర్, గౌతమ్ నగర్, మల్లయ్య నగర్, క్వార్టర్స్ ,అంబేద్కర్ నగర్ ఫేస్3 కాలనీల ప్రజలు ప్రతిసారి ఇదే నరకయాతనను అనుభవిస్తున్నారు. ఈ చౌరస్తా మీదుగానే వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వర్షం కురిసిన ప్రతిసారి మురుగు నీరు రోడ్డంతా కప్పేయడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. పాదచారులు మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- ఏళ్లుగా అదే కథ... మారని పరిస్థితి**

ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. స్థానికులు ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమేనని చెబుతున్నారు. తాత్కాలికంగా మురుగు తొలగించడం తప్ప సమస్య మూలాలను




పరిష్కరించే చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

**- ఏళ్లుగా అదే దుస్థితి... శాశ్వత పరిష్కారం శూన్యం**

ఈ సమస్య నిన్న మొన్నటి నుంచి కాదు. ఎన్నో సంవత్సరాలుగా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం కనిపించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా అధికారులు తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచడం, వర్షపు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం వంటి శాశ్వత చర్యలు మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు.

**- ఎన్నికల హామీలు... ఆ తర్వాత మరుపే**

ఎన్నికల సమయంలో కాలనీల్లో పర్యటించే ప్రజాప్రతినిధులు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీలు ఇస్తారని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ హామీలు గాలిలో కలిసిపోతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతి ఎన్నికలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, కానీ ప్రజల కష్టాలు మాత్రం ఎప్పటికీ తగ్గడం లేదని అంటున్నారు.

**- కాలనీలపై చిన్నచూపా..?**

బోడుప్పల్ సర్కిల్‌లోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా, ఈ ప్రాంత సమస్య మాత్రం ఏళ్లుగా అలాగే ఉండిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వేలాది మంది ప్రజలు ఉపయోగించే ప్రధాన కూడలిలో ఇంత పెద్ద సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ కాలనీల ప్రజలపై చిన్నచూపు ఎందుకనే ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- ప్రమాదాలకు నిలయంగా మారిన చౌరస్తా**

మురుగు నీటిలో రోడ్డు గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని కాలనీవాసులు చెబుతున్నారు.

**- ఇప్పటికైనా స్పందిస్తారా..?**

వర్షాకాలం మొదలైన ప్రతిసారి సమస్య మళ్లీ తెరపైకి వస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించి, వర్షపు నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఐదు కాలనీల ప్రజలు కోరుతున్నారు. మరో వర్షం పడేలోపు చర్యలు చేపట్టకపోతే ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# జోగిపేట గవర్నమెంట్ హాస్పిటల్లో బినామి వైద్యులు..



సంగారెడ్డిడెస్క్, విజన్‌ఆంధ్ర: వైద్యోనారాయణో అంటు డాక్టర్ని పూజిస్తారు. ప్రాణాలు పోసే ప్రత్యక్ష దైవంగా భావిస్తారు. అలాంటిది వైద్య వృత్తికే మచ్చ తెచ్చే విధంగా కొందరు వైద్యులు వ్యవహరిస్తున్నారు. ఇదే కోవకు చెందింది జోగిపేటలోని వంద పడకల గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్. గురువారం సాయంత్రం డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు డాక్టర్ రమేష్ గైర్హజరు అయ్యాడు. ఆయన స్థానంలో మరో వ్యక్తి రవికుమార్ని ఏర్పాటు చేశాడు. సమాచారం అందుకున్న విజన్‌ఆంధ్ర రిపోర్టర్ అతన్ని ప్రశ్నించగా డ్యూటి డాక్టర్ని తానే నంటు రవికుమార్ సమాధానమిచ్చాడు. నిబంధనల ప్రకారం ఆర్పాన్ కూడా వేసుకోలేదు. ఫోటోలు తీస్తుండగా అభ్యంతరం తెలిపాడు. గత ఆరు మాసాల క్రితం స్వయాన మంత్రి దామోదర్ తనీఖి చేయగా ఒక్క డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉండటంతో ఆసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే కమీషనర్కు ఫోన్ చేసి పూర్తి నివేదిక అందించాలని ఆయన ఆదేశించారు. అయినప్పటికి డాక్టర్ల తీరులో ఎలాంటి మార్పు రాలేదని ఈ సంఘటన స్పష్టం చేసింది. గత ఎన్నికల సమయంలో జిల్లా కలెక్టర్ వల్లురి క్రాంతి జోగిపేటకు వచ్చిన సందర్భంగా ఆకస్మికంగా ఆసుపత్రిని తనీఖీచేసింది. అపుడు 13 మంది వైద్యులు గైర్హాజరు అయ్యారు. వారికి షోకాజ్ నోటిసులు జారి చేశారు. జోగిపేట ప్రాంతాన్ని హోల్త్హబ్గా మార్చేందుకు మంత్రి దామోదర్ అహర్నిషలు కృషి చేస్తుంటే వైద్యుల పనితీరు ఆయన కాళ్లకు బంధం వేస్తున్నట్లు, మచ్చ తెచ్చే విధంగా ఉంది.

హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య వివరణ:

గురువారం డ్యూటిలో ఉండాల్ని వైద్యుల రమేష్ స్థానంలో మరో వ్యక్తి రవి విధులో ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం తాను



ఆసుపత్రిలో విచారించగా రవికుమార్ విధులు నిర్వహించినట్లు తేలినట్లు చెప్పింది. ఈ విషయంలో డాక్టర్ రమేష్కు షోకాజ్ నోటిసు ఇవ్వనున్నట్లు చెప్పింది. ఆయన వివరణ తర్వాత జిల్లా అధికారులకు నివేదిస్తానన్నారు. డ్యూటిలో ఉండాల్సిన డాక్టర్



రమేష్ స్థానంలో మరో వ్యక్తి విధులు నిర్వహించడం తప్పిని ఒప్పుకున్నారు.

## ఒడిశా నుంచి తెలంగాణకు నైనీ బొగ్గు చేరిక.. సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం

**- ఎస్టీపీపీకి చేరిన తొలి బొగ్గు రైలు రేకు**

**- రాష్ట్ర విద్యుత్ అవసరాలకే తొలి ప్రాధాన్యం - భట్టి విక్రమార్క**

కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : సింగరేణి చరిత్రలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే రేకు సుమారు 1,131 కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసి గురువారం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)కి చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సింగరేణి గని నుంచి తెలంగాణకు బొగ్గు సరఫరా కావడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి. విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు వీడియో సందేశం ద్వారా సింగరేణి యాజమాన్యం, అధికారులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని, సింగరేణి తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఒడిశాలోని నైనీ గని నుంచి తెలంగాణకు బొగ్గు రవాణా ప్రారంభం కావడం చారిత్రక ఘట్టమన్నారు.సింగరేణి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని, తాడిచెర్ల-2, మణుగూరు డిప్‌సైడ్ బ్లాకులను సంస్థకు సాధించామని తెలిపారు. భవిష్యత్తులో సింగరేణి దేశంలోని ఇతర రాష్ట్రాలు, విదేశాలకు విస్తరించడంతో పాటు క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ రంగాల్లోనూ అడుగుపెట్టాలని ఆకాంక్షించారు.నైనీ సమీప హిందోల్ రైల్వే సైడింగ్ నుంచి 59 దీూశచీ బోగీలలో సుమారు 4,000 టన్నుల జి-10 గ్రేడ్ బొగ్గును తెలంగాణకు తరలించారు. ఈ బొగ్గును రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తికి వినియోగించనున్నారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలంగాణ ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, భారతీయ రైల్వేలు, సంబంధిత అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఎస్టీపీపీకి చేరుకున్న తొలి బొగ్గు రైల్వే రేకుకు సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. నారాయణ, డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమలరావు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం కోల్ యార్డులో బొగ్గు అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ నైనీ గని నుంచి బొగ్గు సరఫరా ప్రారంభించామని తెలిపారు. ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాలకు బొగ్గు సరఫరా చేసిన సింగరేణి, ఇప్పుడు ఇతర రాష్ట్రంలోని తన గని నుంచి స్వరాష్ట్రానికి బొగ్గు తరలించడం అరుదైన ఘట్టమని పేర్కొన్నారు.డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమలరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఎస్టీపీపీలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ యూనిట్ నిర్మాణంలో ఉందని, అది పూర్తయితే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ సీహెచ్ చిరంజీవి, జీఎం ఎం. నరసింహారావు, జీఎం (ఈ&ఎం) సూర్యనారాయణ రాజు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## దివ్యాంగ నిరుద్యోగ యువతకు ఆగస్టు 12న ప్రత్యేక జాబ్ మేళా

**-యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్ సహకారంతో కలెక్టరేట్‌లో నిర్వహణ..**

**-హైదరాబాద్‌లో ఉద్యోగాల భర్తీ**

**-జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**



పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఆగస్టు-06(విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ దివ్యాంగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్ సహకారంతో ఆగస్టు 12న ప్రత్యేక ఉద్యోగ ఎంపిక శిబిరం (జాబ్ మేళా) నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా రిటైల్, ఐటీ/ఐటీఈఎస్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, తయారీ, ఈ-కామర్స్ రంగాల్లోని ప్రముఖ కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రిటైల్ అసోసియేట్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ సపోర్ట్, ఫ్రంట్ ఆఫీస్, ప్రొడక్షన్, వేర్‌హౌస్, లాజిస్టిక్స్ తదితర ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా డిగ్రీ పూర్తి చేసిన శారీరక వైకల్యం, వినికిడి లోపం, స్వల్ప చూపు లోపం ఉన్న దివ్యాంగులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, సదరం సర్టిఫికేట్, ఆధార్, పాన్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8985336947, 8121262441, 9281408587, 7330637711 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATSING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com